మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 14-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 254 Issue: 254

14 మార్చి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:28 సూర్యాస్తమయం - సా. 6:22 తిథి దశమి ఉ. 8:10 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ తె. 4:40ం వరకు తరువాత శ్రవణ యోగం వారియ ఉ. 10:34 వరకు కరణం విష్టి ఉ. 8:10 వరకు బవ రా. 8:45 వరకు వర్జ్యం ఉ. 11:38 నుండి మ. 1:21 వరకు దుర్ముహూర్తం ఉ. 8:03 నుండి ఉ. 8:51 వరకు రాహుకాలం ఉ. 9:27 నుండి ఉ. 10:56 వరకు యమగండం మ. 1:54 నుండి మ. 3:23 వరకు గుళికాకాలం ఉ. 6:28 నుండి ఉ. 7:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:52 నుండి తె. 5:40 వరకు అమృత ఘడియలు రా. 9:56 నుండి రా. 11:39 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:01 నుండి మ. 12:49 వరకు

Published from Jagitial
Circulated to Telangana




## ఒమన్‌లో డ్రోన్ దాడి

### ఇద్దరు భారతీయులు మృతి

### మరో 11 మందికి గాయాలు

మస్కట్: డ్రోన్ దాడి కారణంగా ఒమన్ దేశంలో ఇద్దరు భారతీయులు మృతి చెందారు. ఒమన్‌లోని సోహార్ నగరంలో ఈ దాడి జరిగింది. దాడిలో మరో పదకొండు మందికి గాయాలు అందులో 10 మంది భారతీయులేనని తెలుస్తోంది. ఐదుగురు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. చికిత్స పొందుతున్న తరువాయి 2 వ పేజీలో...



## నేటి నుంచి టెన్త్ పరీక్షలు

### పరీక్షలకు 5 నిమిషాల గ్రేస్ టైం

2

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,099 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,339 |

## విశ్వవాణి



తాజాగా, ఓ డీఎన్ఏ పరీక్షల్లో (అమెరికా, ఇటలీ, చైనాలో సేకరించిన నమూనాలు) తేలిన సమాచారం ప్రకారం.. 9,00,000 ఏళ్ల క్రితమే మనిషి ఉనికి ఉందట. వాళ్ల జాతి అంతరించే సమయానికి 1,280 మంది మాత్రమే మిగిలారట. ఆ సమయంలో వచ్చిన వాతావరణ మార్పులతో 99 శాతం మంది కనుమరుగైపోయారట.

# పొయ్యిలో కట్టెలు

### రూ.15,000కు టన్ను ధర

### హోటళ్లలో మారిన మెనూలు

### వివాహాలపైనా భారీ ప్రభావం

### ఫంక్షన్ హాల్స్ బుకింగ్స్ డౌన్

### ఇండ్లలో వెలిసిన ఇండక్షన్ స్టవ్‌లు



పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు, సామాన్యుల వంటిళ్లు విలవిలలాడుతున్నాయి. ఈ సంక్షోభం మనల్ని మళ్లీ దశాబ్దాల వెనక్కి, అంటే 'కట్టెల పొయ్యి' కాలానికి నెట్టివేస్తోంది.

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు బ్యూరో): ఇరాన్, పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల చమురు ఎగుమతులకు ఆటంకం ఏర్పడి, గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా సరఫరా కూడా కుంటుపడింది. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో వాణిజ్య సిలిండర్ల సరఫరా 75-80% వరకు తగ్గడంతో రెస్టారెంట్లు తమ మెనూ నుంచి దోశ, వడ వంటి వంటకాలను తాత్కాలికంగా తొలగిస్తున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో క్యాటరింగ్ నిర్వాహకులు గ్యాస్ తరువాయి 2 వ పేజీలో...




# 2 నౌకలు వచ్చేస్తున్నాయ్!

### హోర్ముజ్ నుంచి వస్తున్న ఎల్పీజీ నౌకలు.. భారత నౌకలకు ఇరాన్ అనుమతి

దేశవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ముంచుకొస్తున్న వేళ, ఉపశనం కలిగించే వార్త వెలువడింది. వంటగ్యాస్ కోసం దేశంలోని ప్రజల్లో ఆందోళన నెలకొన్న ఈ పరిస్థితుల్లో ఇరాన్‌తో భారత్ ఒప్పందాన్ని కదుర్చుకుంది. హోర్ముజ్ జలసంధి మీదుగా రెండు ఎల్పీజీ ట్యాంకర్లు భారత్ బయలుదేరాయి. భారత్-ఇరాన్ మధ్య పలు దఫాల చర్చల తర్వాత డీల్ కుదిరింది.

టెహ్రాన్/న్యూఢిల్లీ: భారత్‌లోని ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలి మాట్లాడుతూ.. ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర మార్గాలలో ఒకటైన హోర్ముజ్ జలసంధి ద్వారా భారతదేశానికి సురక్షితమైన ప్రయాణాన్ని మంజూరు చేయవచ్చని సంకేతాలిచ్చారు. మీడియాతో మాట్లాడుతూ.. 'భారతదేశం ఇరాన్‌కు మిత్రదేశం' అని ఆయన అన్నారు. హోర్ముజ్ ద్వారా భారత నౌకల రవాణాకు సంబంధించి సానుకూల తీర్మానం అతి త్వరలో రావచ్చని ఆయన చెప్పారు. సమయంలో తమకు అండగా నిలిచిందని ఇరాన్ రాయబారి చెప్పారు. భారత్ బహుళ రంగాల్లో తమకు మద్దతు తరువాయి 2 వ పేజీలో...



# కాపలాదారులం

### పేదలకు అండగా ఉంటాం... మూసీపై తప్పుడు ప్రచారం

### మూసీకి గోదావరి జలాలు తెస్తాం.. 20 టీఎంసీలు తరలింపు చేపట్టాం

### నల్లగొండను సస్యశ్యామలం చేస్తాం.. బాపూఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం

#### మూసీ ఇన్వైట్స్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్

రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి ప్రభుత్వం చేపడుతున్న మూసీ ప్రాజెక్టుపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. మరికొందరు అసంపూర్ణ సమాచారంతో ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం ప్రజలపై ఆధిపత్యం చెలాయించేందుకు కాకుండా, ప్రజా సంక్షేమం కోసం ఒక కాపలాదారుగా వ్యవహరిస్తోందని ఆయన స్పష్టం చేశారు.



హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలోముఖ్యమంత్రి మాట్లాడారు. ఓ బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రిగా, వాస్తవాలను ప్రజలకు నేరుగా వివరించాల్సిన అవసరముందనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానవ తరువాయి 2 వ పేజీలో...


## ఆర్టీసీ సమ్మె సైరన్

### 26 నుంచి సమ్మెకు దిగుతాం: ఆర్టీసీ జేఏసీ.. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్నకు, అలాగే కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌కు సమ్మె నోటీసును జేఏసీ నాయకులు అందజేశారు. మొత్తం 31 డిమాండ్లతో ఈ సమ్మె నోటీసును సమర్పించినట్లు జేఏసీ చైర్మన్ తరువాయి 2 వ పేజీలో...



## జీఎస్టీ స్కాం.. 85 కోట్లు




### తెలంగాణలో వెలుగులోకి

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): రాష్ట్రంలో భారీ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) కుంభకోణాన్ని తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. ఏకంగా రూ.84.15 కోట్ల విలువైన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) స్కామ్ జరిగినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్ కుమార్ గోయల్‌ను జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేశారు. నకిలీ ఇన్వాయిస్‌లను సృష్టించిన-2 వ పేజీలో...



## మహిళలకు ఉద్యోగాలివ్వరు!

### పీరియడ్ లీవ్ పిటిషన్‌పై సుప్రీం

#### సెలవులు తప్పనిసరి చేస్తే ప్రమాదమని వెల్లడి

న్యూఢిల్లీ: మహిళల పీరియడ్ లీవ్‌కు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలకు రుతుస్రావం సమయంలో సెలవులు తప్పనిసరి చేస్తే ఏ కంపెనీలు వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి మట్నగ్గు చూపవని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. రుతుస్రావం సమయంలో మహిళలకు తప్పనిసరిగా సెలవులు ఇవ్వాలని నమోదైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ రోజు శుక్రవారం విచారించింది. మహిళల సహజ రుతుస్రావం సమయంలో విద్యార్థినిలకు, ఉద్యోగస్థులకు తప్పనిసరిగా సెలవులు మంజూరు చేయాలని లాయర్ శైలేంద్ర మణి త్రిపాఠి సుప్రీం కోర్టులో పిటిషన్

## కుప్పకూలిన అమెరికా విమానం

### ఇరాక్‌లో ఆరుగురు దుర్మరణం

పశ్చిమ ఇరాక్‌లో యూఎస్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానం కూలిపోయిన సంఘటనలో విమానంలో ఉన్న మొత్తం ఆరుగురు సిబ్బంది మరణించారని యుఎస్ సెంట్రల్ కమాండ్ శుక్రవారం ధ్రువీకరించింది.

టెహ్రాన్: ఇరాన్‌పై జరుగుతున్న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఈ విమానం రీఫ్యూయలింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటోంది. ఈ ప్రమాదంతో ఆపరేషన్‌లో అమెరికా సైనిక మరణాల సంఖ్య కనీసం 13కి చేరుకుంది. ఇందులో ఏడుగురు యుద్ధంలో మరణించగా, మిగిలినవి ఇతర కారణాల వల్ల జరిగాయి. సుమారు 140 మంది సైనికులు తరువాయి 2 వ పేజీలో...



## ఇరాన్ గగనతలం మా గుప్పిట్లో: ట్రంప్

ఇరాన్ గగనతలం పూర్తిగా తమ గుప్పిట్లోకి వచ్చిందని అమెరికా స్పష్టం చేసింది. ఇరాన్ ఆయుధ నిల్వలు బలహీనపడిన క్రమంలో ఆ దేశ గగనతలాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకున్నామని అమెరికా ఓ ప్రకటనలో వెల్లడించింది.

వాషింగ్టన్: ఇరాన్‌పై కొనసాగిస్తున్న యుద్ధంపై అమెరికా తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో దాడులు చేశాం. ఫైటర్ జెట్లు, బాంబర్లతో ఇరాన్‌పై దాడులు చేశాం. ఇరాన్ అణు సామర్థ్యాలు, తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

14.3.2026

మేషం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. నిరుద్యోగులు శ్రమ వృధాగా మిగులుతుంది. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉండవు.

వృషభం: చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు.

మిధునం: ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు. స్నేహితుల సహాయంతో రుణ సమస్యలు నుండి బయటపడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉ ంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం అంతగా అనుకూలించదు. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

సింహం: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. సన్నిహితులతో మాటపట్టింపు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరగటం వలన తగినంత విశ్రాంతి లభించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారానికి నూతన పెట్టుబడులకు అందుతాయి. వృత్తి ఉ ద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. చాలకాలంగా వేదిస్తున్న సమస్యలు నుండి బయట పడతారు.

తుల: నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక అశాంతి కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి. ఉద్యోగ విషయాల్లో అధికారూలతో జాగ్రత్తగా వ్యవహారించాలి.

వృశ్చికం: ఆదాయ మార్గలు సంతృప్తి కలిగిస్తాయి. ఇంట బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉ ద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ సమర్థవంతంగా నిర్వహిస్తారు.

ధనస్సు: సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించడం మంచిది.

మకరం: ముఖ్యమైన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుని మరింత ముందుకు సాగుతాయి. ధన వ్యవహారాలు ఆశజానాకంగా ఉంటాయి. ఉ ద్యోగస్తులకు అధికారుల అనుగ్రహంతో అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి.

కుంభం: నిరుద్యోగుల కలలు సాకరమౌతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్యాలు ఆహ్వానాలు అందుతాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులుతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టె విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.

# పొయ్యిలో కట్టెలు



మొదటి పేజీ తరువాయి

దొరక్క కట్టెల పొయ్యిలు, బొగ్గులపైనే వంటలు కానిచ్చేస్తున్నారు. గత్యంతరం లేక కట్టెల పొయ్యిని ఆశ్రయించడం తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నా, ఇందులో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. చాలా రోజుల తర్వాత కట్టెల పొయ్యిపై వంట చేస్తుండటంతో వచ్చే పొగ వల్ల వంట చేసేవారికి శ్వాసకోశ ఇబ్బందులు వస్తున్నాయని చెప్తున్నారు. ఇన్నాళ్లూ క్లీన్ ఎనర్జీ వైపు ప్రయాణించి, మళ్ళీ కట్టెల కోసం ప్లైవుడ్ ముక్కలపై ఆధారపడాల్సి వస్తోందని వెల్లడిస్తున్నారు.

## హోటళ్ల నిర్వాహకుల 'కట్టెల' కష్టాలు

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని హాస్టళ్లు, బహదూర్‌పురాలోని పలు హోటళ్లు, పాతబస్తీలోని బిర్యానీ సెంటర్లు వెలవెలబోతున్నాయి. కట్టెల ధర టన్నుకు రూ.15,000కు చేరడం హోటళ్ల నిర్వాహకులకు ఇబ్బందిగా మారింది. నిర్మల్, వరంగల్‌లోనూ హోటళ్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఏపీలోని విజయవాడలో పలు మెస్‌లు, విద్యార్థుల హాస్టళ్ల నిర్వాహక్నుల రోడ్లపైనే కట్టెల పొయ్యిలతో వంట చేస్తున్నారు. కర్ణాటకలోని మెజెస్టిక్, బసవేశ్వరనగర్ వంటి ప్రాంతాల్లోని ప్రముఖ హోటళ్లు కట్టెల పొయ్యిలతోనే కిచెన్ నడిపిస్తున్నాయి. తమిళనాడులోని చెట్టినాడ్ హోటళ్లు, పెళ్లిళ్ల వంటల కోసం కట్టెలను పెద్ద ఎత్తున వాడుతున్నారు. ముంబై, కోల్‌కతా, లక్నో, చెన్నైలలో కూడా హోటల్ నిర్వహణలో కట్టెలు, బొగ్గు వినియోగం పెరిగిందని సమాచారం.

## పెళ్లిళ్లపైనా ప్రభావం

ఎల్‌పీజీ గ్యాస్ కష్టాలు పెళ్లిలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల కొరత పెళ్లి బడ్జెట్‌నే మార్చేసింది. దీంతో వివాహ విందుకోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.కట్టెల పొయ్యి, బొగ్గులతోనే వంట చేసుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరతతో ఫంక్షన్ హాళ్లకు బుకింగ్స్ కూడా రావట్లేదని నిర్వాహకులు వాపోతున్నారు. క్యాటరింగ్ ఆర్డర్లు కూడా కష్టమైపోతున్నాయి. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ కష్టాలు... ఇండియాలో పెళ్లి తంతునే మార్చేశాయి. గత రెండు రోజులుగా గ్యాస్ సిలిండర్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం వలన ఫంక్షన్ హాళ్ల నిర్వహణనే కష్టంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో క్యాటరింగ్ బడ్జెట్ పెరిగిపోవడమే కాదు, ఫంక్షన్ హాల్ బుకింగ్ ధర కూడా అమాంతం పెంచేస్తున్నారు. ఇదే అదనుగు కొంత మంది గ్యాస్ సిలిండర్లను బ్లాక్‌లో ఎక్కువ ధరకు అమ్మేస్తున్నారు. వివాహాలతో పాటు, వివాహ వార్షికోత్సవాలు, పుట్టినరోజు పార్టీలు , పదవీ విరమణ పార్టీలకు బుకింగ్‌లు కూడా ఒక్కసారిగా తగ్గిపోయాయని ఫంక్షన్ హాల్ నిర్వాహకులు చెబుతున్నారు. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన అంతరాయం వలన ఫంక్షన్ హాల్స్ బుకింగ్స్ మాత్రమే కాదు. పార్టీలో ఫుడ్ ఐటెమ్స్ మెనూ కూడా మారిపోయింది. కొన్ని రకాల ఐటెమ్స్‌ను మెనూ నుండి పూర్తిగా తొలగించారు. ఎక్కువ గ్యాస్, బొగ్గు అవసరమయ్యే నాన్, తందూరి వంటి స్నాక్ ఐటెమ్స్ స్థానంలో అవిరిపై ఉడికించే మోమోస్, ఇడ్లీ వంటివి సిద్ధం చేస్తున్నారు. దీనితో పాటు పాస్తా, దోసా, చాట్ కౌంటర్స్‌ను కూడా చాలా వరకు తగ్గించారు. పెళ్లి విందులో 50 నుండి 60 వరకు ఉన్న వంటకాలను 15 నుండి 20కు తగ్గించారు.

# 2 నౌకలు వచ్చేస్తున్నాయ్!

మొదటి పేజీ తరువాయి

అందించిందని చెప్పారు.

హర్మూజ్ వద్ద మరో 6 నౌకలు

భారత్‌కు పయనమైన 8 ఎల్పీజీ ట్యాంకర్లు ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయాయి. వీటిని సురక్షితంగా జలసంధిని దాటించేందుకు భారత ప్రభుత్వం ఇరాన్‌తో సంప్రదింపులు జరపగా, రెండు నౌకలకు ప్రస్తుతానికి అనుమతి లభించింది. కాగా, ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధ జ్వాలల నుంచి రెండు చమురు నౌకలు చాకచక్యంగా బయటపడ్డాయి. ఇందులో ఒకటి బుధవారం భారత్‌కు చేరుకోగా.. మరొకటి రెండ్రోజుల్లో రానుంది. ఈ రెండింటి ద్వారా 3 మిలియన్ బ్యారెళ్ల చమురు అందుబాటులోకి రానుంది.

గ్యాస్ సంక్షోభం లేదు: కేంద్రం

వంటగ్యాస్ కొరతపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. భారత్‌లో గ్యాస్ సంక్షోభం లేదని పెట్రోలియం శాఖ స్పష్టం చేసింది. ప్యానిక్ బుకింగ్స్ వద్దని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ కోరారు. అవసరం లేకున్నా ఆందోళనతో గ్యాస్ బుక్ చేయొద్దన్నారు. బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకుంటున్నామన్న పెట్రోలియం శాఖ.. గ్యాస్ అందుబాటులో ఉందని.. ఆందోళన అక్కర్లేదని పేర్కొంది. దేశంలో పెట్రోల్ కొరత కూడా లేదని.. 30 శాతం ఎల్పీజీ ఉత్పత్తి పెంచినట్లు కేంద్రం వెల్లడించింది. ఎల్పీజీ బదులు ప్రజలు పీఎన్‌జీ తీసుకోవాలని.. ఎప్పటిలాగానే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని కేంద్రం సూచించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోల్, గ్యాస్ కొరత ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్న ప్రజలు.. భారీగా పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్‌ల వద్ద క్యూ కడుతున్నారు. మరోవైపు, వాణిజ్య సిలిండర్ల కొరతతో అనేక హోటల్స్‌లలో నుంచి మెనూ మార్చేశారు. కొన్ని డిష్‌లకు తాత్కాలికంగా మంగళం పాడేశారు. ఇక పలు టీ దుకాణాలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి ఉంది.

# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): పదో తరగతి పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో స్కూల్ ఎడ్యుకేషన్ విభాగంగా అధికారులు కీలక నిర్ణయాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా విద్యార్థులకు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా నమూనా ఓఎంఆర్ షీట్లు, జవాబు పత్రాల ఫార్మాట్‌ను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 2,676 కేంద్రాల్లో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలి. ఇంటర్ పరీక్షల మాదిరి పదో తరగతి పరీక్షలకు 5 నిమిషాల గ్రేస్ టైం ఉంటుంది. ఉదయం 9.35 తర్వాత విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

# ఆర్టీసీ సమ్మె సైరన్

మొదటి పేజీ తరువాయి

ఈదురు వెంకన్న తెలిపారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలని, 2017 పీఆర్‌సీ అమలు చేసి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, 2021 పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం, కార్మికులపై విధించిన శిక్షలను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జెసి వైస్ చైర్మన్ థామస్ రెడ్డి కోరారు.

# జీఎస్టీ స్కాం.. 85 కోట్లు

మొదటి పేజీ తరువాయి

నిందితుడు సందీప్ కుమార్ గోయల్.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నట్లు విచారణలో గుర్తించారు. అయితే ఈ ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ మాత్రమే కాకుండా.. సందీప్ కుమార్ గోయల్‌కు సంబంధం ఉన్న ఇతర కంపెనీల్లోనూ అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఈ క్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేసిన అధికారులు.. సందీప్ కుమార్ గోయల్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ద్వారా సందీప్ కుమార్ గోయల్.. ఎలాంటి వస్తువులు అమ్మకుండానే.. కేవలం పేపర్ల మీదే ఇన్‌వాయిస్‌లను తయారు చేసి కోట్ల రూపాయల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను నిబంధనలకు విరుద్ధంగా క్లెయిమ్ చేసినట్లు జీఎస్టీ అధికారులు గుర్తించారు. ఎస్‌కేజీ కంపెనీ ఒక్కటే కాకుండా.. సందీప్‌తో సంబంధాలు ఉన్న హెచ్‌ఎఫ్‌సీ స్టీల్ ట్యూబ్స్ అండ్ వాల్వ్స్.. విజయ్ ఇండస్ట్రియల్ నీడ్స్ ఎల్‌ఎల్‌పీ వంటి ఇతర సంస్థల పేర్లతో కూడా ఇదే రకమైన మోసాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ఈ భారీ మోసం బయటికి రావడంతో జీఎస్టీ అధికారులు వెంటనే రంగంలోకి దిగి విచారణ చేశారు. జీఎస్టీ మోసాలకు పాల్పడిన 2 సంస్థల జీఎస్టీ రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ జీఎస్టీ చట్టం-2017 కింద నిందితుడు సందీప్ కుమార్‌పై కేసు కూడా నమోదు చేశారు. సందీప్ కుమార్ గోయల్‌ను కోర్టులో హాజరుపరచగా.. అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే ఇలాంటి ఫేక్ ఐటీసీ క్లెయిమ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు హెచ్చరించారు.

# కాపలాదారులం

మొదటి పేజీ తరువాయి

నాగరికత నదీ పరివాహక ప్రాంతాల్లోనే అభివృద్ధి చెందిందని.. ప్రపంచ దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే మనం వెనుకబడితే భావి తరాలు క్షమించవని ఆయన హెచ్చరించారు. 1908 మూసీ వరదల సమయంలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహాతో నిజాం నిర్మించిన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లు వందేళ్లుగా నగరాన్ని వరదల నుంచి కాపాడటమే కాకుండా దాహార్తిని తీరుస్తున్నాయని గుర్తుచేశారు. అటువంటి గొప్ప వారసత్వ సంపద కలిగిన మూసీని కాలుష్యమయంగా వదిలేద్దామా లేక పునరుజ్జీవింపజేసుకుందామా అని ఆయన ప్రజలను ప్రశ్నించారు.

## మూసీకి గోదావరి జలాలు

మూసీ, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ ఆనాడు అస్థికలు కలిపారని.. అంతటి చరిత్ర ఉన్న బాపూ ఘాట్ ను ఎంతమంది పర్యాటకులు సందర్శిస్తున్నారని సీఎం ప్రశ్నించారు. కాలుష్యంతో మూసీ నది విషతుల్యంగా మారిందన్నారు. మానవ తప్పిదాలతో నల్గొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారని.. రంగారెడ్డి జిల్లాలో పుట్టిన మూసీ నది హైదరాబాద్ కు వచ్చే సరికి కాలుష్యమయంగా మారుతోందన్నారు. మూసీకి, హైదరాబాద్ నగరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని.. రాజకీయ ప్రయోజనాల కోసం ఆ చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా లేక మూసీనదితో పాటు హైదరాబాద్ నగరాన్ని పునరుజ్జీవింపజేసుకుందామా అంటూ ప్రశ్నలు గుప్పించారు. ఎవరికో నష్టం కలిగించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. లంగర్ హౌస్ వద్ద బాపూఘాట్ ను పర్యాటక కేంద్రంగా చేస్తామని సీఎం చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించామని.. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నామన్నారు.

## అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారు?

మూసీ పునరుజ్జీవనాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేవలం కాలుష్య నివారణే కాకుండా, మూసీ పరివాహక ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి పర్యాటకాన్ని, 'నైట్ ఎకానమీ'ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ప్రాజెక్టును అడ్డుకుంటున్న వారు ఒకసారి కంటైనర్ హౌస్‌లో మూడు నెలల పాటు కాలుష్యంతో నిండిన ఆ పరిసరాల్లో నివసించగలరా అని సవాల్ విసిరారు. అభివృద్ధిని అడ్డుకోవడం పరిష్కారం కాదని, తప్పులుంటే సూచనలు చేయండి కానీ, లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞాన్ని ఆపకండి అని ఆయన కోరారు.

## బాధితులకు అండగా ప్రభుత్వం

మూసీ ప్రాజెక్టు ఎవరి ఆస్తులు గుంజుకునేందుకు కాదని, ఇది భవిష్యత్ తరాల కోసం చేపట్టిన అభివృద్ధి అని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న వారికి, నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పిస్తామని, వారి వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. వారికి ఇళ్లు, పాఠశాలలు, ఉపాధి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ చేస్తున్నారని విమర్శించే వారికి సమాధానమిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం పర్యాటక అభివృద్ధి చేస్తే తప్పేముందని ప్రశ్నించారు.

## ప్రజల సహకారంతోనే అభివృద్ధి

ప్రతిపక్షాలు కేవలం రాజకీయ పగతో ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే భయంతోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. "కడుపులో కుళ్ళు, మాటల్లో విషం"తో కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని, కానీ పేద ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. తాము ప్రజల్లో ఒకరిగా ఉండి, ప్రజల సలహాలు, సూచనలను స్వీకరిస్తామని, అందరి సహకారంతో హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## కుప్పకూలిన అమెరికా విమానం

మొదటి పేజీ తరువాయి

గాయపడ్డారని పెంటగాన్ నివేదించింది. రెండు కేసీ-135 విమానాలు పాల్గొన్న 'ఫ్రెండ్లీ ఎయిర్‌స్పేస్' సంఘటనలో ఒకటి కూలిపోయింది. మరొక విమానం సురక్షితంగా ఇజ్రాయెల్‌లో ల్యాండ్ అయింది. ప్రమాదం శత్రు కాల్పులు లేదా స్నేహపూర్వక కాల్పుల వల్ల జరిగిందికాదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. ఇరాన్ మద్దతుగల ఇరాకీ మిలిటంట్లు విమానాన్ని కాల్చివేశామని పేర్కొన్నప్పటికీ, అమెరికా సైన్యం దానిని తిరస్కరించింది. ఇది మిడ్-ఎయిర్ ఇన్సిడెంట్ లేదా టెక్నికల్ సమస్య వల్ల జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

## ఒమన్‌లో డ్రోన్ దాడి

మొదటి పేజీ తరువాయి

వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని వెల్లడించింది. డ్రోన్ దాడిలో గాయపడిన మిగిలిన వారు కూడా చికిత్స పొంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఒమన్ అధికారులు, సంబంధిత కంపెనీ ప్రతినిధులతో టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. వారికి అవసరమైన సాయం అందిస్తున్నామని వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి 1.50 లక్షల మంది భారత్‌కు వచ్చినట్లు భారత విదేశాంగ తెలిపింది. ఒమన్ డ్రోన్ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ఒమన్ న్యూస్ ఏజెన్సీ ప్రకారం, సోహార్‌లో రెండు డ్రోన్ దాడులు జరిగాయి. ఇందులో ఒకటి అల్ అవి ఇండస్ట్రియల్ జోన్‌ను తాకిందని, ఇక్కడ పనిచేసే భారతీయులు ఇద్దరు మృతి చెందారు.

## మహిళలకు ఉద్యోగాలివ్వరు!

మొదటి పేజీ తరువాయి

దాఖలు చేశారు. ఆ విధంగా అన్ని రాష్ట్రాలకు ఆదేశాలివ్వాలని కోర్టును కోరారు. ఆ పిటిషన్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. 'పీరియడ్ సమస్యపై, దాని సున్నితత్వంపై అవగాహన కల్పించడం వేరు. రుతుక్రమం సమయంలో సెలవులు తప్పనిసరి అనిచట్టం చేస్తే మహిళలకే నష్టకరంగా మారవచ్చు. వారిని ఎవరూ ఉద్యోగంలోకి తీసుకోరు. గవర్నమెంట్ ఉద్యోగాలు, జ్యూడీషియరీ జాబ్స్ ఎందులోనూ వారికి చోటు ఉండదు. కంపెనీల మనస్థత్వం మీకు తెలియదు' అని అన్నారు. అయితే దీనిపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఇదే అంశంపై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 21 ప్రకారం ఆడపిల్లలకు గౌరవంగా జీవించే హక్కు ఉందని ఆరోగ్యం, విద్య, గౌరవం వారికి ప్రభుత్వాలు కల్పించాల్సిన బాధ్యత అని తెలిపింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వాలు వారికి ఉచితంగా నాప్‌కీన్స్, ప్రత్యేకమైన టాయిలెట్స్, మెంటల్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొంది.

## ....మా గుప్పిట్లో: ట్రంప్

మొదటి పేజీ తరువాయి

మిస్సైల్ స్థావరాలు, నేవీ వ్యవస్థను నాశనం చేయడమే మా టార్గెట్. ఇరాన్ గగనతలం పూర్తిగా మా గుప్పిట్లోకి వచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ దాడులు ఆపేది లేదు. యుద్ధంలో ఏడుగురు అమెరికా సైనికులు మృతి చెందారు. 140 మంది సైనికులకు గాయాలయ్యాయి. ఇరాన్ ఒంటరి అయిపోయింది. ఇరాన్ ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇరాన్‌పై దాడులను మరింత ఉధృతం చేస్తాం' అని అమెరికా పేర్కొంది. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతాన్యాహుల సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఇరాన్ తమకు సరెండర్ కాబోతుందన్న ట్రంప్.. తమ దాడులకు ఇరాన్ భయపడిందంటూ వ్యాఖ్యానించారు. యుద్ధంపై నిర్ణయం తీసుకోవడానికి టెహ్రాన్‌లో అధికారులు ఎవరూ సజీవంగా లేరని.. ఇరాన్ లొంగిపోయేందుకు సిద్ధంగా ఉందన్నారు.



# రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్రంగూడ అడవి

**తెలంగాణ సర్కారు ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో కాలుష్యం పెరిగిపోతోంది. అదే సమయంలో వేసవి కాలంలో నగరవాసులు వేడిని తట్టుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో అర్బన్ పార్కులను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ సర్కార్ కీలక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులో మరో భారీ అర్బన్ ఫారెస్ట్ పార్కు అందుబాటులోకి వచ్చింది. గుర్రంగూడ అటవీ ప్రాంతానికి సంబంధించి రిజర్వ్ ఫారెస్ట్‌గా మారుస్తూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ గుర్రంగూడ అటవీ భూములకు సంబంధించి కొనసాగుతున్న న్యాయ పోరాటానికి తెరపడింది. ఆమన్‌గల్ డివిజన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ అటవీ భూములను రిజర్వ్ ఫారెస్ట్‌గా మార్చుతూ.. శుక్రవారం అధికారిక ఉత్తర్వులను విడుదల చేసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో పర్యావరణానికి పెద్ద పీట వేయడంలో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. ఈ గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ 424.31 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. తెలంగాణ ఫారెస్ట్ చట్టం--1967లోని సెక్షన్ 15 ప్రకారం.. పర్యావరణ, అటవీ శాఖ జీఓ నంబర్ 7 ద్వారా గుర్రంగూడ అటవీ భూములకు రిజర్వ్ ఫారెస్ట్ హోదాను కల్పించింది. ఈ గుర్రంగూడ అటవీ భూముల్లో ఉన్న సాహెబ్‌నగర్ కలాన్ గ్రామానికి చెందిన 102 ఎకరాలపై.. చాలా కాలంగా కోర్టులో న్యాయ వివాదం సాగింది. ఈ కేసును 'సాహెబ్‌నగర్ కలాన్ కేసు'గా పిలుస్తారు. చివరికి అటవీ శాఖ చేసిన వాదనను సమర్థించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. దీంతో ఆ ప్రాంతంలో ఆక్రమణదారుల నుంచి అటవీ భూమికి విముక్తి లభించడంతో.. దాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ నగరం మొత్తం ఇప్పుడు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు మొత్తంగా నిర్మాణాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే నగరవాసులు స్వచ్ఛమైన గాలిని పీల్చే అవకాశం లేకుండా.. మొత్తంగా కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే నగరవాసులకు స్వచ్ఛమైన గాలిని అందించే గ్రీన్ లంగ్ స్పేస్‌గా ఈ గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ అర్బన్ ఫారెస్ట్‌లో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా మార్గాలు ఏర్పాటు చేయనున్నారు. వీకెండ్స్‌లో ఫ్యామిలీతో కలిసి గడిపేందుకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. అటవీ ప్రాముఖ్యతను కళ్లకు కట్టినట్లు వివరించేలా నాలెడ్జ్ సెంటర్లను ఈ గుర్రంగూడ అటవీ భూముల్లో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. గుర్రంగూడ అటవీ భూములను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించడంతో అక్కడి వృక్ష సంపద, జీవవైవిధ్యానికి చట్టపరంగా రక్షణ లభించనుంది. దీంతో ఆ ప్రాంతంలో ఎలాంటి అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలకు తావుండదు. హైదరాబాద్ నగరం చుట్టుపక్కల ఇప్పటికే గజ్వేల్, శామీర్‌పేట వంటి అర్బన్ పార్కుల తరహాలోనే.. ఈ గుర్రంగూడ పార్కు కూడా బీఎన్ రెడ్డి నగర్, హస్తినాపురం, సాగర్ రోడ్ ప్రాంతాల్లో నివసించే వారికి పర్యాటక కేంద్రంగా మారనుంది. ఇప్పటికే గండిపేట, కోత్వాల్‌గూడ వంటి ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులకు నగరవాసుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు నిర్మించనున్న ఈ గుర్రంగూడ అర్న్ పార్కులో మరిన్ని అత్యాధునిక వసతులు, బయో డైవర్సిటీ పాయింట్లను ఏర్పాటు చేసేలా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి భూ సర్వే, ఫెన్సింగ్ పనులు ప్రారంభం కానున్నాయి.

## గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

భువనగిరి, మార్చి 13 (ఈవార్తలు): ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. వంట గ్యాస్ కొరత కారణంగా గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ఇళ్ల వరకు రావడానికి రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు వివిధ ప్రాంతాల్లో గ్యాస్ గోడౌన్ల వద్దకు వచ్చి క్యూ కడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో, జనగాం జిల్లా రఘునాథపల్లిలో వంట గ్యాస్ కోసం ప్రజలు సిలిండర్లతో బారులు తీరారు. మూడు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ రాలేదని వరుసలో నిలబడిన వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కేంద్రం వల్లే గ్యాస్ కొరత

**సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు**

**మంత్రి పొన్నం ఆరోపణలు**

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు. మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్ ఉందని, ఈ ప్రాజెక్టుపై ఉన్న అన్ని అనుమానాలను పీపీటీ ద్వారా నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, అందుకే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం అనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయవద్దని సూచించారు.

# పేదలను టచ్ చేస్తే పోరాటమే

**టీజీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు**



హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు. మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

# పోలీస్ శాఖలో 17 వేల ఉద్యోగాలు

**భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు.. రాష్ట్రస్థాయికి ఎస్సై పోస్టులు, సర్వీస్ రూల్స్‌లో సవరణలు**



హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): రాష్ట్రంలో మరోసారి పోలీస్ ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధం అవుతోంది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు రెడీ అవుతోంది. తెలంగాణ పోలీస్ సర్వీస్ రూల్స్‌లో కీలక మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి పోలీస్ శాఖ ప్రతిపాదనలు పంపించింది. ఈ ప్రతిపాదనలను కేబినెట్ సబ్ కమిటీకి ప్రభుత్వం సిఫార్సు చేసింది. ఇప్పటివరకు ఎస్సై పోస్టులు జోనల్ స్థాయిలో ఉండగా.. వాటిని రాష్ట్ర స్థాయికి మార్చాలని పోలీస్ శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. పదోన్నతుల విషయంలో తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో పోలీస్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనలకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. జోన్లతో సంబంధం లేకుండా రాష్ట్రస్థాయి పోస్టులుగా ఎస్సైలు మారనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక విద్య, ఉద్యోగాల్లో స్థానికులకే అవకాశం కల్పించే ఉద్దేశంతో రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించారు. పోలీస్ శాఖలో ఎస్సై పోస్టును జోనల్ స్థాయిలో ఉంటారు. అంటే ఏ జోన్‌కు ఎంపికైన ఎస్సైలు అదే జోన్‌లో పనిచేయాల్సి ఉంటుంది. అదే జోన్‌లో ప్రమోషన్ కూడా పొందొచ్చు. అయితే ఈ నిర్ణయం వల్ల కొంతమంది ఎస్సైలకు అన్యాయం జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒకే బ్యాచ్‌లో ఎస్సైలుగా సెలెక్ట్ అయి ఉద్యోగంలో చేరినప్పటికీ.. ఆయా జోన్లలో ఉన్న ఖాళీల కారణంగా కొందరికి ముందుగానే ప్రమోషన్లు వస్తున్నాయి. ఖాళీలు ఉన్న జోన్‌లోని ఎస్సైలు సీఐ, డీఎస్పీ, అదనపు ఎస్పీలుగా ప్రమోషన్లు అందుకుంటుంటే.. అదే బ్యాచ్‌లో ఎస్సైగా ఎంపికై ఇతర జోన్లలో ఉన్న వారు.. ఇంకా ఎస్సైలుగానే మిగిలిపోతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి 2015లో దాదాపు 18 వేలు.. 2018లో 18,428 ఉద్యోగాలు.. 2022లో 15,644 ఉద్యోగాలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేసింది. అయినా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి పోలీస్ శాఖలో 17 వేలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు పోలీస్ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. పోలీస్ శాఖలో మొత్తం 95,361 పోస్టులు ఉండగా.. అందులో 77,369 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని.. ఇంకా 17,992 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్ శాఖలో ఏడాదికి 6 వేల నుంచి 7 వేల మంది రిటైర్మెంట్ అవుతుండటంతో భారీగా ఖాళీలు ఏర్పడుతున్నాయి.

# హిడ్మాను హింసించి చంపేశారు: దేవ్‌జీ



హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన శుక్రవారం ఓ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

## పీఎం కిసాన్ నిధులు రిలీజ్

**అసోంలో విడుదల చేసిన ప్రధాని**

గువాహటి: రైతులకు పెట్టుబడి సాయం అందించే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 22వ విడత విడుదలైంది. మార్చి 13 శుక్రవారం రోజున అసోంలోని గువాహటిలో జరిగిన ఓ కార్యక్రమం వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పీఎం కిసాన్ 22వ విడత నిధులను విడుదల చేశారు. అర్హులైన రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. 9.32 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ. 18640 కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా జమ చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ ద్వారా అర్హులైన రైతులకు ప్రతి సంవత్సరం పెట్టుబడి సాయంగా రూ.6000 కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. ఒకేసారి కాకుండా ప్రతి సంవత్సరం మూడు విడతల్లో రూ.2000 చొప్పున డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరుక 21 విడతల్లో నిధులు జమ చేశాగా ఈరోజు 22వ విడత నిధులను ప్రధాని మోదీ అసోంలోని గువాహటి నుంచి విడుదల చేశారు. రబీ సీజన్ సాగు ఇప్పటికే పూర్తయిన క్రమంలో రైతులు పీఎం కిసాన్ నిధుల కోసం ఇన్నాళ్లు వేచి చూశారు. ఎట్టకేలకు కేంద్రం పీఎం కిసాన్ నిధులను విడుదల చేసింది. అయితే, ఈసారి దాదాపు 4 లక్షల మంది రైతుల పేర్లను తొలగించింది.

## రేవంత్ బినామీ కంపెనీపై కేసులు తారుమారు!

**కేంద్ర మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ**



హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు. తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు. రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

## గ్యాస్ కొరత లేదు

**వదంతులు నమ్మవద్దు.. మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన**

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

## రాహుల్.. నీ నీతి ఏది?

**హరీశ్ రావు ఘాటు లేఖ**

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతబట్టి దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని, కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం ప్రభుత్వం మరోలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తు చేశారు. అలాగే రాహుల్ గాంధీ కూడా దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని అన్నారు. కానీ తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని అన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించడమే రాజ్యాంగాన్ని రక్షించడమా అని ఎద్దేవా చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు.

## హైదరాబాద్‌లో 'వికీ ప్రింట్'

**క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ప్రింట్**

కూకట్‌పల్లి-హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మన జీవనశైలిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నగదు రహిత లావాదేవీల నుంచి ఆన్‌లైన్ షాపింగ్ వరకు ప్రతిదీ స్మార్ట్‌ఫోన్‌తోనే ముడిపడి ఉంది. ఈ క్రమంలో, డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకునే విధానంలోనూ ఓ కొత్త ఆవిష్కరణ హైదరాబాద్ వాసులకు అందుబాటులోకి వచ్చింది. ఇకపై ప్రింటౌట్ కోసం జిరాక్స్ దుకాణాల వద్ద వేచి చూడాల్సిన అవసరం లేకుండా, మనిషితో సంబంధం లేకుండా నేరుగా ప్రింట్ తీసుకునే అత్యాధునిక కియోస్క్ నగరంలో ఏర్పాటైంది. హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌లో 'వికీ ప్రింట్' పేరుతో ఈ సెల్ఫ్ సర్వీస్ ప్రింటింగ్ కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. అత్యవసరంగా ఏదైనా డాక్యుమెంట్ ప్రింట్ తీసుకోవాలనుకునే వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ కియోస్క్ ద్వారా ప్రింట్ తీసుకోవడం చాలా సులభం. ముందుగా కియోస్క్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తమ స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయాలి. వెంటనే ఫోన్‌లో ఫైల్ అప్‌లోడ్ ఆప్షన్ కనిపిస్తుంది. వినియోగదారులు తమ ఫోన్‌లో సేవ్ చేసుకున్న డాక్యుమెంట్, సర్టిఫికేట్ లేదా ఏదైనా ఫైల్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. ఫైల్ అప్‌లోడ్ చేసిన తర్వాత, ప్రింట్ బ్లాక్ అండ్ వైట్‌లో కావాలా? లేక కలర్‌లో కావాలా?, అలాగే ఎన్ని కాపీలు కావాలో ఎంచుకోవాలి. ఎంపిక చేసుకున్న ఆప్షన్ల ఆధారంగా చెల్లించాల్సిన మొత్తాన్ని స్క్రీన్‌పై చూపిస్తుంది. ఆ తర్వాత యూపీఐ ద్వారా సులభంగా చెల్లింపు పూర్తి చేయవచ్చు. పేమెంట్ పూర్తయ్యాక, వినియోగదారుడి మొబైల్ నంబర్‌ను నమోదు చేయమని అడుగుతుంది. నంబర్ ఎంటర్ చేయగానే ఫోన్‌కు ఒక ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని కియోస్క్‌పై ఉన్న కీప్యాడ్‌లో ఎంటర్ చేసిన వెంటనే, కోరుకున్న ప్రింటౌట్లు బయటకు వస్తాయి.



## తీగుల్ ఆలయంలో రీ ఎస్టిమేషన్

గజ్వేల్, మార్చి 13 (ఈవార్తలు): సిద్దిపేట జిల్లా తీగుల్ గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో దేవాదాయ శాఖ అధికారులు రీ ఎస్టిమేషన్ ప్రక్రియ నిర్వహించారు. దీని కోసం శుక్రవారం ఆలయంలో కొలతలు తీసుకున్నారు. స్పెషల్ డీఈ ఓం ప్రకాశ్ ఈ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పాత ఎస్టిమేట్లను రివైజ్ చేసి ఆలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు, తీగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాశ్ రావు, వార్డు సభ్యులు బునారి రాజు, యువజన కాంగ్రెస్ నాయకుడు మనోజ్, బాల్ రెడ్డి, నరసింహా రెడ్డి, ఆర్కేఎస్ యువ నాయకులు రాజు, రంజిత్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాషన్ డిజైనింగ్ లో ఉచిత టైలరింగ్‌కు దరఖాస్తులు



కూకట్‌పల్లి–హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ కూకట్ పల్లి ఆధ్వర్యంలో మహిళలకు 15 రోజుల ఉచిత టైలరింగ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు కూకట్ పల్లి బ్రాంచ్ డైరెక్టర్ దీపిక తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల పట్ల మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఇటువంటి వృత్తి విద్యా కోర్సుల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. సంస్థ మంచి ఉద్దేశంతో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ రంగంలో అవగాహన కల్పించేందుకు 15 రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్స్ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికెట్స్ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు . ఈ కోర్సులో రోజుకు 3 గంటల శిక్షణ అందించబడుతుందని చెప్పారు. ఈ శిక్షణలో రోజుకు రెండు బ్యాచ్ లు ఉంటాయి. మొదటి బ్యాచ్: ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రెండవ బ్యాచ్: మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 16వ తేదీ నుండిశిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. టైలరింగ్ నేర్చుకోవాలనుకునే ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్: 9573909009/ 9030610055 నంబర్ లలో సంప్రదించవచ్చు.

## పెంబట్ల-కొనాపూర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తవ్వాలి

**అధికారులకు ఎమ్మెల్యే సంజయ్ ఆదేశాలు**


సారంగాపూర్, మార్చి 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల–కొనాపూర్ బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యక్రమాల నిమిత్తం అటుగా వెళ్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడారు. బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత ఈఈ, కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రాయికల్ మండలం రామాజీపేట్, మహితాపూర్ బ్రిడ్జి వద్ద ఉన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు, రవాణాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో గ్రామస్థులు, నాయకులు ఆందోళనను విరమించారు.



## గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు చేయూత

జగిత్యాల టౌన్, మార్చి 13 (ఈవార్తలు): గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. జగిత్యాల పట్టణానికి చెందిన నలుగురు గల్ఫ్ కార్మికులు విదేశాల్లో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షల విలువ గల ప్రొసీడింగ్ కాపీలను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా జగిత్యాల పట్టణ, రూరల్, అర్బన్ మండలాలకు చెందిన 10 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఎమ్మార్వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163



జగిత్యాల టౌన్, మార్చి 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జిల్లా పరిధిలోని 68 పరీక్ష కేంద్రాలలో ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ప్రతి పరీక్ష కేంద్రం పరిసరాల్లో ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు 200 మీటర్ల పరిధిలో గుంపులుగా నిలబడి ఉండొద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో పరిసర ప్రాంతాల్లోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నారాయణగూడలో కవిత జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మార్చి 13 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గుమ్మడి క్రాంతి ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడ చౌరస్తా లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా విద్యార్థి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి కవితక్క జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుమ్మడి క్రాంతి మాట్లాడుతూ ఉద్యమ నేత తెలంగాణ సాంస్కృతిక విలువలను ప్రపంచానికి పరిచయం చేయడంలో కవితక్క చేసిన కృషి అభినందనీయమని అన్నారు. మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. అక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజల ఆశీస్సుల తో మునుముందు ఎన్నో గొప్ప శిఖరాలను అలంకరించాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.



## రైతు విజ్ఞాన యాత్రకు శ్రీకారం




జగిత్యాల టౌన్, మార్చి 13 (ఈవార్తలు): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు విజ్ఞాన యాత్రను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న జిల్లా రైతులు సిద్దిపేట జిల్లా నరిమెట్టలోని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించి సాగు విధానాలు, శిక్షణ, మార్కెటింగ్‌పై అవగాహన పొందనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయం చేయాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుతం దేశంలో ఆయిల్‌పామ్‌కు అధిక డిమాండ్ ఉందని, ఇందులో అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.





## మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి బలం

**మహిళా దినోత్సవ వేడుకల్లో డాక్టర్ సంజయ్**

జగిత్యాల టౌన్, మార్చి 13 (ఈవార్తలు): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జగిత్యాల జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం వివిధ శాఖల్లో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులు, అధికారులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, రాజ గౌడ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, డీఎంహెచ్ఓ సుజాత, బీసీ వెల్ఫేర్ అధికారి సునీత, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఏఓ శ్రీనివాస్, మహిళా అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కేబినెట్ భేటీకి పవన్ డుమ్మా!

**ఉస్తాద్ పనుల్లో బిజీ వల్లే: రోజా**

అమరావతి, మార్చి 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కోసం కాకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని వైసీపీ నేత రోజా తీవ్రంగా విమర్శించారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశం ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోయినా, చంద్రబాబు, పవన్‌లకు మాత్రం గొప్ప లబ్ధి చేకూర్చిందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రజల కంటే సొంత ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆమె సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు. "ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో జరిగిన కేబినెట్ సమావేశాన్ని చూశాక, ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తోందో నాకు స్పష్టంగా అర్థమైంది. రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం కాకుండా, కేవలం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఈ సమావేశం జరిగిందా అనిపిస్తోంది. కీలకమైన ప్రభుత్వ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు రాలేదు. ఆయన తన కొత్త సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్' నిర్మాణ పనుల్లో బిజీగా ఉన్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే, అదే సమయంలో ఆయన సినిమాకు బెనిఫిట్ షోలు వేసుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం నన్ను ఆశ్చర్యపరిచింది. మార్చి 19 నుంచి ఉదయం 4 గంటలకే షోలు వేసుకునేందుకు, టికెట్ ధరను రూ.500 వరకు అమ్ముకునేందుకు అనుమతులు ఇచ్చారు. అంతేకాదు, 10 రోజుల పాటు సింగిల్ స్క్రీన్లలో రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 పెంచుకోవచ్చని కూడా ఉత్తర్వులిచ్చారు. మరోవైపు, పవన్ గైర్హాజరును ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకే మరో ఆరుగురు మంత్రులు కూడా సమావేశానికి రాలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి.



## మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడిపెల్లి కృష్ణ**

జగిత్యాల టౌన్, మార్చి 13 (ఈవార్తలు): జగిత్యాల వాల్మీకి రాసిన రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి ఐదు రోజుల్లో అందరికి అర్థం అయ్యే విధంగా రచించిన మహిళా కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శాలివాహన సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో ఉన్న శాలివాహన సంఘ భవనంలో శుక్రవారం మొల్లమాంబ 585వ జయంతి వేడుకలను లింగంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు సిరికొండ రమేశ్ ఆధ్వర్యంలో మనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మామిడిపెల్లి కృష్ణతో పాటు వార్డు కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్ తదితరులు మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. 16వ శతాబ్దంలో శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో తొలి తెలుగు కవయిత్రిగా మొల్లమాంబ గుర్తింపు పొందిందన్నారు. మహిళలతో పాటు కుమ్మరి కులస్థులు మొల్లమాంబను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతూ ఆమె ఆశయాలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం జిల్లా కేంద్రంలో మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా జగిత్యాల ప్రాంత నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, జిల్లా వృత్తి విభాగం అధ్యక్షుడు మామిడిపెల్లి మహిపాల్, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు చింతకింది నరేష్, జిల్లా కోశాధికారి సిరికొండ రాజన్న, సహాయ అధ్యక్షుడు సిరికొండ వెంకటి, కోశాధికారి అనీల్, ఉపాధ్యక్షుడు గంగాధర్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు సిరికొండ శ్రీనివాన్, నాయకులు సిరికొండ మొండయ్య, సిరికొండ రాజేశం తదితరులు ఉన్నారు.

## పరిశ్రమలకు పెద్దపీట

**భారీగా భూ కేటాయింపులు**

**ఏపీ క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు**

అమరావతి, మార్చి 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు. దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది.

## 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల

గన్నవరం, మార్చి 13 (ఈవార్తలు): ఏపీలోని రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు నిధులను విడుదల చేశారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యే నాటికే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతుల అభివృద్ధి, సాగునీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ దిశగా అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాను కూడా రైతు బిడ్డనేనని, రైతుల కష్టాలు తనకు బాగా తెలుసని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఏటా రూ.20,000 అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000కు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 భరిస్తోందని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. గత 20 నెలలుగా అనేక సమస్యలను అధిగమిస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మాణ పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో జలవనరుల యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించామని సీఎం పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదితో అనుసంధానం చేసి సాగునీటి సమస్యలను అధిగమించామన్నారు. చెరువుల్లో పూడిక తీసి నీటితో నింపడం వల్ల ఖరీఫ్, రబీ పంటల తర్వాత కూడా జలకళ ఉందన్నారు. దీని ఫలితంగా భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని వివరించారు. కాలువల్లో పూడికతీత, డ్రెయిన్ల ఆధునికీకరణకు ఆదేశాలు జారీ చేశామని, చివరి ఆయకట్టు భూములకు కూడా నీరు అందించే బాధ్యతను సాగునీటి సంఘాలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు తీసుకువస్తున్నామని, డిజిటల్ క్రాప్ సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఆక్వా రైతులకు రూ.810 కోట్ల రాయితీ అందించామని, రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామని చెప్పారు. డిమాండ్ ఆధారిత పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తామని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి గన్నవరం విమానాశ్రయం నుంచి ఎగుమతులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలవరం పూర్తయితే కృష్ణా డెల్టా ప్రాంతం మొత్తం సస్యశ్యామలం అవుతుందని, రాష్ట్రంలో సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## కూటమి సర్కారు.. అప్పుల సర్కారు: పేర్ని నాని

తాడేపల్లి, మార్చి 13 (ఈవార్తలు): వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఏపీలోని కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, శాంతిభద్రతలపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. హెరిటేజ్ సంస్థకు రాయితీలు ఇస్తున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను 'అప్పుల మంత్రి'గా అభివర్ణించిన పేర్ని నాని, ప్రభుత్వం అప్పుల విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పక్కా ఆధారాలతో నిజాలు మాట్లాడారని, వాటిని అబద్ధమని నిరూపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3.27 లక్షల కోట్ల అప్పు చేసినట్లు జీవోలు ఉన్నాయని, కానీ అప్పులు కేవలం లక్ష కోట్లేనని తప్పుడు లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ లెక్కలపై వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు పెరుగుతున్నాయని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళను వేధిస్తే చర్యలు తీసుకోకపోగా, తిరిగి ఆమెపైనే కేసులు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు. మహిళలను వేధిస్తే అదే వారికి చివరి రోజు అన్న చంద్రబాబు మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. అలాగే హాస్టళ్లలో పిల్లలకు సరైన భోజనం అందడం లేదని, మైలవరం స్కూల్ ఘటనలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానాల్లో విదేశాలకు వెళ్లి క్రికెట్ చూస్తున్నారని, ఆయనకు విద్యార్థుల కష్టాలు పట్టడం లేదని అన్నారు. హెరిటేజ్ సంస్థ అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలంట అంటూ ధ్వజమెత్తారు. కరెంటు బిల్లుల్లో కూడా రాయితీలు కల్పిస్తున్నారని పేర్ని నాని ఆరోపించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు నియామకంపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ సంబంధాల ఆరోపణలు ఉన్న వ్యక్తికి పవిత్రమైన టీటీడీ పదవి ఎలా ఇస్తారని నిలదీశారు.



# ఒక్కరోజే 10 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లో బ్లాక్ ఫ్రైడే

ముంబై: భారత స్టాక్ మార్కెట్ శుక్రవారం నాడు భారీ నష్టాలు చవిచూసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా సూచీలు కుప్పకూలడంతో, ఇన్వెస్టర్ల సంపద కేవలం ఒక్కరోజే ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర ఆవిరైంది. ఈ భారీ పతనంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.429 లక్షల కోట్లకు పడిపోయింది. ఈ వారంలో మొత్తం నష్టం రూ.20 లక్షల కోట్లకు చేరినట్లు అంచనా. పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య పెరుగుతున్న యుద్ధ మేఘాలు మార్కెట్లను తీవ్రంగా భయపెట్టాయి. హోర్ముజ్ జలసంధి మూసివేత పరిణామాలతో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 100.61 డాలర్లకు చేరింది. చమురు ధరల పెరుగుదల దిగుమతుల బిల్లును పెంచుతుందనే ఆందోళనతో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయి 92.45కు పడిపోయింది. దీనికి తోడు, అమెరికాలో బాండ్ యీల్డ్స్ పెరగడంతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) భారత మార్కెట్ల నుంచి పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకుంటున్నారు. గత 10 రోజులుగా అమ్మకాలు కొనసాగిస్తున్న ఎఫ్ఐఐలు, ఒక్క గురువారమే రూ.7,050 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. మొత్తం 10 సెషన్లలో రూ.57 వేల కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఈ పరిస్థితులు కొనసాగితే మార్కెట్లు మరింత పతనం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తూ, ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



## నేతాజీ టోపీ ఒరిజినల్‌గా లేదు: చంద్రకుమార్ బోస్

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రకుమార్ బోస్ సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలోని ఎర్రకోటలో ఉన్న నేతాజీ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచిన టోపీ అసలైనది కాదేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చంద్రకుమార్ బోస్ కథనం ప్రకారం, 2019లో నేతాజీ ధరించిన అసలైన టోపీని తమ కుటుంబ సభ్యులు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీకి అందజేశారు. ఎర్రకోటలో ఏర్పాటు చేస్తున్న మ్యూజియంలో దానిని భద్రపరచాలని విజ్ఞప్తి చేయగా, ప్రధాని అంగీకరించారు. మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ స్వయంగా ఆ టోపీని ఒక గాజు పెట్టెలో ఉంచి ప్రదర్శనలో పెట్టారు. అయితే, ఆ తర్వాత ఆ టోపీని ప్రదర్శనల కోసం దేశంలోని వేర్వేరు మ్యూజియంలకు పంపారని, ఇటీవల అది తిరిగి ఎర్రకోట మ్యూజియంకు చేరిందని తెలిసింది. కానీ, ప్రస్తుతం అక్కడ ప్రదర్శనలో ఉన్న టోపీ, తాము ఇచ్చిన అసలైన టోపీలా కనిపించడం లేదని చంద్రకుమార్ బోస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీకి లేఖ రాయడంతో పాటు ఎక్స్‌లో కూడా పోస్ట్ చేసినట్లు తెలిపారు. 'ప్రస్తుతం అక్కడ ఉన్న టోపీ ప్రామాణికతను నిర్ధారించాలి. మేము ఇచ్చిన అసలైన టోపీకి, దీనికి తేడా కనిపిస్తోంది. అందుకే దీనిపై తప్పనిసరిగా విచారణ జరగాలి' అని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీ వాస్తవాలను నిగ్గు తేల్చాలని తమ కుటుంబం తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు చంద్రకుమార్ బోస్ పేర్కొన్నారు.


## కామాఖ్య అమృత్ భారత్ రైలు ప్రారంభం

గౌహతి: అసోం, రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ రైలును ప్రధాని అసోంలో ప్రారంభించారు. అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఈ రైలు సేవలు అందించనుంది. దీనితో ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ రైలు మార్గమధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం పట్టణం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతూ, అక్కడి నుంచి చర్లపల్లికి చేరుకుంటుంది.

# మన డబ్బుతో మనపైనే క్షిపణులు

**పాక్ క్రికెటర్ కొనుగోలుపై అనిరుద్ధాచార్య.. కావ్యా మారన్‌పై వెల్లువెత్తుతున్న విమర్శలు**

ఇండోర్: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ప్రవచనకర్త అనిరుద్ధాచార్య.. సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ సహ యజమాని కావ్యా మారన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్ వేలంలో పాకిస్థాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేయడంపై ఆయన మండిపడ్డారు. భారతీయులకు పాకిస్థాన్‌పై ఎందుకంత ప్రేమ? అని ఆయన ప్రశ్నించారు. ఇండోర్‌లో జరుగుతున్న 'సనాతన్ ప్రీమియర్ లీగ్' సందర్భంగా అనిరుద్ధాచార్య శుక్రవారం ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. "ఆ డబ్బుకు వారు పన్ను కట్టాక, మిగిలిన డబ్బుతో మనపైనే క్షిపణులు ప్రయోగిస్తారు. డబ్బు మన దేశంలోనే ఉండాలి. భారత్ ఆత్మనిర్భర్‌గా మారాలి. పాకిస్థానీ క్రికెటర్ల బదులు మన భారతీయ ఆటగాళ్లను ప్రోత్సహించాలి. మతం చూసి చంపుతున్న పాకిస్థాన్‌పై అంత ప్రేమ ఎందుకు? ఇక్కడ ఆడుతున్న మన పిల్లలను ఎంపిక చేయాలి" అని అనిరుద్ధాచార్య అన్నారు. కాగా, పాక్ ఆటగాడిని కొనుగోలు చేయడంపై భారత అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రాంచైజీని 'దేశ వ్యతిరేకి'గా అభివర్ణిస్తూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో, కొన్ని గంటల్లోనే సన్‌రైజర్స్ లీడ్స్ అధికారిక ఎక్స్ ఖాతా నిలిచిపోయింది. ఈ ఖాతాను ఓపెన్ చేయబోతే "నిబంధనలు ఉల్లంఘించినందున ఖాతాను సస్పెండ్ చేశాం" అని ఎక్స్ నుంచి సందేశం వస్తోంది.





# భారత్ బాధపడితే మేమూ బాధపడతాం

## ఇరాన్ రాయబారి



న్యూఢిల్లీ: భారత్, ఇరాన్ మధ్య ఉన్న సంబంధాలు అత్యంత బలమైనవని, ఉమ్మడి ప్రయోజనాలు, విలువల పునాదిపై ఇవి నిర్మితమయ్యాయని భారత ఇరాన్ రాయబారి డాక్టర్ మొహమ్మద్ ఫతాలీ స్పష్టం చేశారు. ఇరు దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ద్వైపాక్షిక సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, ఇరాన్ ప్రజల మధ్య బలమైన ఐక్యతా భావం ఉందని, అదే ద్వైపాక్షిక సహకారానికి పునాది అని ఫతాలీ పేర్కొన్నారు. "భారత ప్రజల కష్టం మా కష్టంగా భావిస్తాం, మా కష్టాన్ని వారు తమదిగా చూస్తారు. ఈ కారణంగానే భారత ప్రభుత్వం మాకు సహాయం చేస్తోంది. మేం కూడా భారత ప్రభుత్వానికి అండగా నిలవాలి. ఎందుకంటే మనకు ఉమ్మడి విశ్వాసాలు, ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి" అని ఆయన వివరించారు. భారత్‌లో ఇరాన్ రాయబారిగా, ఇరు దేశాల మధ్య అవగాహన, సహకారాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ఇటీవల ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య కీలక చర్చలు జరిగాయని ఫతాలీ వెల్లడించారు. "మా ఉన్నత స్థాయి అధికారులు భారత ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఫలప్రదమైన సంప్రదింపులు జరిగాయి" అని ఆయన పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు ఇరుపక్షాలు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నాయని, భవిష్యత్తులో సహకారం మరింత విస్తరిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మధ్య జరిగిన చర్చలను ఆయన ప్రస్తావిస్తూ, ఇరు దేశాల నాయకత్వం సంబంధాలను పటిష్టం చేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ ఖుద్స్ డే కాన్ఫరెన్స్ 2026 గురించి మాట్లాడుతూ, ప్రజలు న్యాయం, సత్యం వైపు నిలబడాలని పిలుపునిచ్చారు. "చరిత్రలో సరైన వైపు నిలబడేందుకు ప్రయత్నించండి" అని ఆయన సూచించారు. ఇరాన్ తన సూత్రాలు, విలువల ఆధారంగానే ముందుకు సాగుతుందని, భారత్ వంటి మిత్ర దేశాలతో సహకారాన్ని కొనసాగిస్తుందని డాక్టర్ ఫతాలీ తేల్చిచెప్పారు.

## భర్తను పకోడీలు తెమ్మని.. ప్రియుడితో జంప్

లక్నో: ఆకలేస్తోందని భార్య అడిగింది. పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లి భర్త పకోడీలు తీసుకొచ్చాడు. కానీ, తిరిగి వచ్చి చూసేసరికి ఆమె కనిపించలేదు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ వింత ఘటన పోలీసుల వరకు వెళ్లింది. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యూపీలోని అమ్రోహా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్‌కు, రాంపూర్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల రిమ్‌ఝిమ్‌తో గతేడాది డిసెంబర్ 1న వివాహం జరిగింది. హోలీ పండుగ కోసం పుట్టింటికి వెళ్లిన రిమ్‌ఝిమ్‌ను, పండుగ ముగిశాక ఈ నెల 9న ప్రీతమ్ తిరిగి తన ఇంటికి తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో మరో బస్సు కోసం మొరాదాబాద్ జిల్లాలోని బిలారీ బస్టాండ్‌లో వారు వేచి ఉన్నారు. ఆ సమయంలో ఆకలిగా ఉందని, వేడివేడి పకోడీలు తీసుకురమ్మని రిమ్‌ఝిమ్ భర్తను కోరింది. దీంతో ప్రీతమ్ పక్కనే ఉన్న బండి వద్దకు వెళ్లాడు. కొద్ది నిమిషాల్లోనే పకోడీలు తీసుకుని తిరిగి రాగా, భార్య కనిపించకపోవడంతో షాక్ అయ్యాడు. చుట్టుపక్కల వెతికినా, స్థానికులను అడిగినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన ప్రీతమ్, వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. తన భార్య.. ఆమె పుట్టింటి గ్రామమైన ఓ యువకుడితో వెళ్లిపోయి ఉండొచ్చని భర్త ప్రీతమ్ పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు, బస్టాండ్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

## భారత్‌లో పెరగనున్న బెంజ్ ధరలు



ముంబై: ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా తమ కార్ల ధరలను పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి అన్ని మోడళ్లపై సుమారు 2 శాతం మేర ధరలు పెరగనున్నట్టు తెలిపింది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, విదేశీ మారకద్రవ్యంలో అస్థిరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ విషయంపై కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ బ్రెండన్ సిసింగ్ మాట్లాడుతూ.. "ముఖ్యంగా యూరోతో పోలిస్తే భారత రూపాయి విలువ తగ్గడం వల్ల నిర్వహణ ఖర్చులు పెరిగాయి. వ్యాపార సుస్థిరత కోసం ఈ ధరల సవరణ తప్పనిసరి అయింది. ఏప్రిల్ 1 నుంచి మా పోర్ట్‌ఫోలియో అంతటా సుమారు 2 శాతం ధరల పెంపును అమలు చేస్తున్నాం" అని తెలిపారు. అయితే, ఈ పెంపు ప్రభావం వినియోగదారులపై వీలైనంత తక్కువగా ఉండేలా చూస్తామని, అత్యుత్తమ ఉత్పత్తులు, సేవలు అందించడంపై తమ దృష్టి కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, మరో జర్మన్ లగ్జరీ కార్ల సంస్థ ఆడి ఇండియా ఇప్పటికే ధరల పెంపు నిర్ణయం తీసుకుంది. తమ కార్ల ధరలను ఏప్రిల్ 1 నుంచి 2 శాతం వరకు పెంచుతున్నట్లు ఈ వారంలోనే ప్రకటించింది. ముడిసరుకుల ధరలు, కరెన్సీ రేట్లలో మార్పులే ఇందుకు కారణమని ఆడి కూడా స్పష్టం చేసింది. దీంతో ఏప్రిల్ నుంచి రెండు ప్రధాన జర్మన్ లగ్జరీ కార్ల బ్రాండ్ల ధరలు పెరగనున్నాయి.

## ఇరాన్ చేరిన 84 మంది నావికుల మృతదేహాలు

కొలంబో: శ్రీలంక తీరానికి సమీపంలో అమెరికా జరిపిన దాడిలో ఇరాన్ నావికులు మృతి చెందడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, 84 మృతదేహాలను శ్రీలంక ప్రభుత్వం ఇరాన్ కు పంపించింది. ఈ మేరకు శ్రీలంక రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. మత్తల అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరిన ప్రత్యేక విమానంలో ఈ మృతదేహాలను తరలించారు. మార్చి 11న గాలే చీఫ్ మేజిస్ట్రేట్ సమీర దొడంగోడ ఇచ్చిన ఆదేశాల మేరకు మృతదేహాలను ఇరాన్ రాయబార కార్యాలయ అధికారులకు అప్పగించారు. గాలేలోని నేషనల్ ఆసుపత్రిలో రెండు మొబైల్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లలో వీటిని భద్రపరిచారు. గాలే హార్బర్ పోలీసులు కోర్టుకు సమర్పించిన అభ్యర్థన మేరకు న్యాయమూర్తి ఈ ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. మార్చి 4న అంతర్జాతీయ జలాల్లో ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి టార్పెడోతో దాడి చేసి, ముంచివేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ధృవీకరించారు. "మా జలాంతర్గామి ప్రయోగించిన టార్పెడో దాడిలో ఆ నౌక మునిగిపోయింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక శత్రు నౌకను టార్పెడోతో ముంచివేయడం ఇదే తొలిసారి" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ దాడి గురించి అమెరికా తమకు ముందుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని శ్రీలంక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఘటనపై శ్రీలంక ఆరోగ్య, ప్రసార శాఖ మంత్రి నళింద జయతిస్స మాట్లాడుతూ, విషయం తెలిసిన వెంటనే తమ నౌకాదళం స్పందించి సహాయక చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ దుర్ఘటనలో మొత్తం 87 మృతదేహాలను వెలికితీయగా, 32 మందిని ప్రాణాలతో కాపాడినట్లు తెలిపారు. వీరిలో 10 మంది ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫిబ్రవరిలో విశాఖపట్నంలో జరిగిన నౌకాదళ విన్యాసాల్లో ఈ ఇరాన్ యుద్ధనౌక పాల్గొన్నట్లు సమాచారం.

## ఇజ్రాయెల్ వార్నింగ్.. కాసేపటికే పేలుడు

టెహ్రాన్: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం. దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం ఈ ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.




## మారుతి డిజైర్ సరికొత్త రికార్డ్

ముంబై: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకి ఇండియా తమ పాప్యులర్ సెడాన్ 'డిజైర్' అమ్మకాలలో ఓ అరుదైన మైలురాయిని అందుకున్నట్లు ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఈ కారు అమ్మకాలు 30 లక్షల యూనిట్లను దాటాయని కంపెనీ తెలిపింది. భారత మార్కెట్లో అత్యంత ఆదరణ పొందిన కార్లలో డిజైర్ ఒకటిగా నిలుస్తోంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా డిజైర్ నిలిచిందని, సెడాన్ విభాగంలో ఇప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోందని మారుతి సుజుకి పేర్కొంది. 2008లో తొలిసారిగా మార్కెట్లోకి వచ్చిన ఈ కారు, ఇప్పటివరకు నాలుగు జనరేషన్ల అప్‌గ్రేడ్లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా మారుతి సుజుకి ఇండియా మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మాట్లాడుతూ.. "ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకోవడంపై 30 లక్షల మంది డిజైర్ కస్టమర్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాలుగో తరం డిజైర్ తన అధునాతన లుక్స్‌తో సెడాన్ సెగ్మెంట్‌కు కొత్త ఊపునిచ్చింది. కొనుగోలుదారుల్లో దాదాపు 50 శాతం మంది యువత, తొలిసారి కారు కొనేవారే ఉండటం దీనికి ఉన్న ఆదరణకు నిదర్శనం" అని తెలిపారు. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అనేక ఫీచర్లతో పాటు 5-స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా డిజైర్ విజయానికి కారణమని బెనర్జీ తెలిపారు. భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్, గ్లోబల్ ఎన్‌క్యాప్ రెండింటిలోనూ ఈ మోడల్ 5-స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించడం విశేషం. ఆటోమేటెడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్ వంటి అధునాతన ఫీచర్లను అందిస్తూ ఈ కారు మార్కెట్లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో మారుతి సుజుకి అమ్మకాల్లో 12 శాతం వృద్ధిని నమోదు చేసింది.

## శశికళ కొత్త పార్టీ ప్రకటన



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు సొంత పార్టీని ప్రకటించారు. 'ఆలిండియా పురుచ్చి తలైవార్ మక్కల్ మున్నేట్ర కళగం' అనే పార్టీని స్థాపించి మళ్ళీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టారు.. ఏఐఏడీఎంకే వ్యవస్థాపకులు ఎంజీ రామచంద్రన్‌ను అభిమానులు 'పురుచ్చి తలైవార్' అని పిలుచుకుంటారు. ఆయన గౌరవార్థం తన పార్టీ పేరులో ఆ పదాన్ని చేర్చడం ద్వారా శశికళ క్యాడర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తన పార్టీ గుర్తుగా 'కొబ్బరి చెట్టు'ను ఆమె ప్రకటించారు. జయలలిత అసలైన వారసురాలిగా తనను తాను నిరూపించుకోవాలని శశికళ చూస్తున్నారు. జయలలిత మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, ఆపై జైలు శిక్ష కారణంగా ఆమె రాజకీయ ప్రస్థానానికి అప్పట్లో విరామం పడింది. అయితే ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుపై ఆమె ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ ప్రకటన సందర్భంగా ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు నివాళులర్పించిన శశికళ... రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు.

లగ్జూరి చిత్రం



# మరోసారి శేఖర్ కమ్ముల-చైతూ



తెలుగు సినీ పరిశ్రమలో సహజసిద్ధమైన కథలు, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. ఆయన సినిమాల్లో కనిపించే సహజత్వం, సున్నితమైన భావాలు, జీవనానికి దగ్గరగా ఉండే పాత్రలు ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి. 'డాలర్ డ్రీమ్స్' చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శేఖర్ కమ్ముల తర్వాత 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్', 'లీడర్', 'ఫిదా' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారు. ముఖ్యంగా ప్రేమకథలను సహజంగా చెప్పడంలో ఆయనకు ఉన్న ప్రత్యేకత యువతలో మంచి క్రేజ్‌ను తెచ్చిపెట్టింది. కథలోని ఎమోషన్స్‌ను సున్నితంగా చూపించడం, పాత్రల సహజత్వాన్ని కాపాడటం, సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం శేఖర్ కమ్ముల సినిమాల ప్రధాన లక్షణాలు. అందుకే ఆయన సినిమాలు సాధారణ కథలే అయినప్పటికీ ప్రేక్షకుల హృదయాలను తాకే విధంగా ఉంటాయి. ఇక తాజాగా శేఖర్ కమ్ముల మరోసారి నాగ చైతన్య తో కలిసి సినిమా చేయబోతున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 100 పర్సెంట్ లవ్ స్టోరీ మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే కాంబో మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ కొత్త సినిమాకు సంబంధించి ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని తెలుస్తోంది. షూటింగ్ వచ్చే నెలలో ప్రారంభమయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఈ సినిమా కూడా భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా ఉండే అవకాశం ఉందని సమాచారం.

## టికెట్ ధరల పెంపుపై సుప్రీం కీలక తీర్పు



సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే విధిస్తూ సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో సాధారణంగా సినిమా టికెట్ ధరలు పెంచాలంటే విడుదలకు 90 రోజుల ముందే ప్రభుత్వం జీవో జారీ చేయాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నిబంధనల వలన సినిమా నిర్మాణం, విడుదల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం తెలంగాణ హైకోర్టు తీర్పును తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న పాత పద్ధతిలోనే టికెట్ ధరల పెంపు ప్రక్రియను కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో త్వరలో విడుదల కాబోయే భారీ బడ్జెట్ చిత్రం పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రీమియర్ షోలకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు మార్గం సుగమమైంది.

## త్రిష సైలెన్స్.. అర్ధాంగీకారమా?

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. తమిళ స్టార్ హీరో విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నారంటూ గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ కలిసి ఒక పెళ్లి వేడుకకు హాజరైనప్పటి నుండి ఈ రూమర్స్ మరింత ఎక్కువయ్యాయి. తాజాగా చెన్నై విమానాశ్రయంలో త్రిష మీడియా కంట పడటంతో, విలేకరులు ఆమెను ఈ వివాదం గురించి సూటిగా ప్రశ్నించారు. అయితే త్రిష ఇచ్చిన రియాక్షన్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎయిర్‌పోర్టుకు స్టైలిష్ డ్రెస్ లో చేరుకున్న త్రిషను చూడగానే రిపోర్టర్లు ఒక్కసారిగా చుట్టుముట్టారు. విజయ్‌తో కలిసి పెళ్లి వేడుకకు వెళ్లడంపై వస్తున్న ఆరోపణల గురించి ఆమెను ప్రశ్నించారు. అయితే త్రిష ఏమాత్రం అసహనం వ్యక్తం చేయకుండా, చాలా ప్రశాంతంగా తన దారిన తాను వెళ్లిపోయారు.





## తప్పైంది.. క్షమించండి: రాజేంద్రప్రసాద్

టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తమిళ సినీ వర్గాల్లో పెద్ద వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా కోలీవుడ్ లెజెండ్ ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) గురించి చేసిన కామెంట్స్ అక్కడి అభిమానులను తీవ్రంగా ఆగ్రహానికి గురి చేశాయి. పెద్ద ఎత్తున ట్రోల్స్ కూడా వచ్చాయి. దీంతో రాజేంద్రప్రసాద్ చివరకు క్షమాపణలు చెప్పారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తెలుగు పౌరాణిక చిత్రాల ద్వారా గుర్తింపు పొందిన నటుడు కాంతారావు గురించి మాట్లాడిన రాజేంద్రప్రసాద్, ఆయన గొప్పతనాన్ని వివరించే క్రమంలో ఎంజీఆర్ పేరును ప్రస్తావించారు. కాంతారావును చూసి ఎంజీఆర్ కూడా భయపడేవారంటూ.. వ్యాఖ్యానించారు. రాజేంద్రప్రసాద్ చివరకు తమిళ్ లో వీడియో విడుదల చేసి క్షమాపణలు చెప్పారు. తాను ఎంజీఆర్‌ను ఎంతో గౌరవంగా భావిస్తానని, ఆయనపై ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. కాంతారావును ప్రశంసించే క్రమంలో అనుకోకుండా నోరు జారిందని వివరించారు. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టినట్లయితే క్షమాపణలు కోరుతున్నానని, భవిష్యత్ లో ఇలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్త పడతానని రాజేంద్రప్రసాద్ తెలిపారు.

## ఈ ఏడాదే అనుష్క పెళ్లి?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ 'జేజమ్మ' అనుష్క శెట్టి పెళ్లి గురించి గత కొన్నేళ్లుగా ఎన్నో వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే ఈసారి వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 44 ఏళ్ల ఈ సుందరి ఈ ఏడాదే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. కుటుంబ సభ్యులు కుదిర్చిన సంబంధంతోనే ఆమె పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని, ఇండస్ట్రీలో ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. ఈ వార్త విన్న అభిమానులు ఆమెకు ముందే శుభాకాంక్షలు చెబుతూ సోషల్ మీడియాను నింపేస్తున్నారు. అనుష్క పెళ్లి చేసుకోబోయే వ్యక్తి ఎవరనే దానిపై అందరిలోనూ భారీ కుతూహలం నెలకొంది. అందుతున్న సమాచారం ప్రకారం.. వరుడు సినిమా రంగానికి చెందిన వ్యక్తి కాదట. అనుష్క కుటుంబానికి ఎంతో కాలంగా సన్నిహితంగా ఉంటున్న ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని తెలుస్తోంది. ఇక ఇప్పటికే ఇరు కుటుంబాల పెద్దలు కూర్చుని పెళ్లి విషయమై ఒక నిర్ణయానికి వచ్చారని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక గతంలో ప్రభాస్ వంటి హీరోలతో అనుష్క పేరు వినిపించినా, ఇప్పుడు మాత్రం ఒక బిజినెస్ మ్యాన్‌తో పెళ్లి పక్కా అని సినీ వర్గాలు అంటున్నాయి.


## కష్టాల్లోనూ ధైర్యంతో ఉండాలి

టాలీవుడ్ 'దేశముదురు' బ్యూటీ హన్సిక మోత్వానీ తన వ్యక్తిగత జీవితంలో తీసుకున్న కీలక నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. వ్యాపారవేత్త సోహైల్ కతూరియాతో ఆమె అధికారికంగా విడాకులు తీసుకున్న వార్త అభిమానులను కొంత కలవరపెట్టినా, ఆమె స్పందించిన తీరు మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచింది. విడాకుల తర్వాత తొలిసారిగా సోషల్ మీడియాలో స్పందించిన హన్సిక, తన మనోధైర్యాన్ని చాటుతూ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కష్టాల్లో కూడా పాజిటివ్‌గా ఎలా ఉండాలో ఆమె తన పోస్ట్‌తో నిరూపించింది. చట్టబద్ధంగా విడాకులు మంజూరైన మరుసటి రోజే హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో "చార్డీ కలా ఆల్వేస్" అని రాసుకొచ్చింది. ఈ పంజాబీ పదానికి అర్థం ఏమిటంటే.. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా, ఎంతటి కష్టం వచ్చినా అచంచలమైన ధైర్యంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగడం. తన వైవాహిక బంధం ముగిసినా, తాను కృంగిపోలేదని, రెట్టింపు ఉత్సాహంతో తన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నట్లు ఈ పోస్ట్ ద్వారా క్లారిటీ ఇచ్చేసింది. ఏళ్ల తరబడి సైలెంట్‌గా ఉన్న హన్సిక, ఇలా ఒక్క మాటతో తన మనసులోని ధైర్యాన్ని చెప్పడం విశేషం.



## ఆ ఒక్క కోరిక అదే: రాశీ ఖన్నా


గబ్బర్ సింగ్ వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయం సొంతం చేసుకున్న తర్వాత పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబోలో సినిమా కోసం అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వీరిద్దరి కాంబో సెట్స్ పైకి వెళ్లింది అనే వార్తలు రాగానే ఆహా.. ఓహో అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తూ వస్తున్నారు. రాజకీయాలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ కమిట్ అయిన సినిమా కోసం పవన్ కళ్యాణ్ వీలున్నప్పుడల్లా డేట్లు ఇచ్చి షూటింగ్ పూర్తి చేయడం జరిగింది. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రస్తుతం విడుదలకు రెడీ అవుతోంది. మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి కాలరే ఎత్తరా అనే సాంగ్‌ను విడుదల చేయడం జరిగింది. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించాడు. ఈ పాట కోసం దాదాపుగా 1500 నుంచి 2000 మందిని వినియోగించినట్లు దర్శకుడు చెప్పుకొచ్చాడు. ఈ పాటలో పవన్ కళ్యాణ్ తో రాశి ఖన్నా ఆడి పాడినట్లుగా దర్శకుడు పేర్కొన్నాడు. పవన్ కళ్యాణ్ తో సినిమా అనగానే మరో ఆలోచన లేకుండా, కనీసం కథ ఏంటి అని కూడా అడగకుండానే రాశి ఖన్నా నటించింది అంటూ హరీష్ శంకర్ చెప్పుకొచ్చాడు. కథ వినకుండా డైరెక్ట్‌గా పవన్ కళ్యాణ్ తో షూటింగ్ లో జాయిన్ అయిందని రాశి ఖన్నా గురించి చెప్పుకొచ్చాడు. పాట విడుదల కార్యక్రమంలో హీరోయిన్ రాశి ఖన్నా పాల్గొంది.





## నేడు కుల్దీప్ పెళ్లి

టీమిండియా స్టార్ క్రికెటర్ కుల్దీప్ యాదవ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశిక చద్దాను శనివారం పెళ్లి చేసుకోనున్నాడు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో వీరి వివాహం ఘనంగా జరగనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయానంతరమే కుల్దీప్ యాదవ్ పెళ్లి వార్త అందరి దృష్టిని ఆకర్షించింది. అతని కాబోయే సతీమణి గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు ఆసక్తి చూపుతున్నారు. వంశిక చద్దా, కుల్దీప్ యాదవ్ చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ కాన్పూర్‌కు చెందినవారే. పాఠశాల స్థాయి నుంచి ఈ ఇద్దరి మధ్య స్నేహం ఉన్నట్లు తెలుస్తోంది. కాన్పూర్‌లోని శ్యామ్ నగర్‌లో వంశిక కుటుంబం నివసిస్తుండగా.. కుల్దీప్ యాదవ్ కుటుంబం కాన్పూర్‌లోని లాల్ బంగ్లా ప్రాంతంలో ఉంటుంది. కాలక్రమేణా వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్‌కు మంచి గుర్తింపు లభించినప్పటికీ, వంశిక మాత్రం బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా సాదాసీదా జీవితాన్నే గడుపుతున్నారు.



### కేకేఆర్‌లోకి
## జింబాబ్వే పేసర్

ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) తమ జట్టులోకి జింబాబ్వే పేస్ సెన్సేషన్ బ్లెస్సింగ్ ముజరబానిని తీసుకుంది. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ స్థానాన్ని ముజరబానితో భర్తీ చేసింది. ఈ విషయాన్ని కేకేఆర్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. బ్లెస్సింగ్ ముజరబానికి స్వాగతం అంటు ఒక పోస్ట్ చేసిన కేకేఆర్.. మరో పోస్ట్‌లో టీ20 ప్రపంచకప్‌లో అతని సంచలన బౌలింగ్ వీడియోను షేర్ చేసింది. 6 అడుగుల 8 అంగుళాల పొడవున్న ముజరబాని జింబాబ్వే అత్యుత్తమ బౌలరని, తన హైట్ ద్వారా లభించే బౌన్స్‌తో వికెట్లు తీసే సామర్థ్యం అతనికి ఉందని కేకేఆర్ తమ ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ ఫ్రాంచైజీ లీగ్స్‌ల్లోని ఆయన అనుభవం కేకేఆర్ పేస్ విభాగాన్ని బలోపేతం చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది.





## ఇషాన్ గర్ల్‌ఫ్రెండ్ అందాల విందు

టీమిండియా యువ సెన్సేషన్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తన ఆటతో ఎంత సందడి చేస్తాడో మనందరికీ తెలిసిందే. అయితే ఇషాన్ కిషన్ పర్సనల్ లైఫ్‌పై కూడా అభిమానులకు అంతే ఆసక్తి ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యం ఇషాన్ కిషన్ ప్రియురాలు, ప్రముఖ మోడల్ అదిత్ హుండియా సోషల్ మీడియాలో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా అదితి తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఫోటోలను పంచుకుంది. "అన్‌స్క్రిప్టెడ్ మూమెంట్స్" అనే క్యాప్షన్ ఇచ్చి పంచుకున్న ఈ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. అదితి హుండియా షేర్ చేసిన ఈ ఫోటోలలో ఆమె ఎంతో రిలాక్స్‌డ్ మూడ్‌లో కనిపిస్తోంది. గ్లామర్ ప్రపంచంలో ఎప్పుడూ మేకప్‌తో మెరిసే అదితి.. ఈ ఫోటోలలో మాత్రం చాలా నేచురల్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. బాత్రూమ్ అద్దం ముందు నిలబడి తీసుకున్న స్టైలిష్ సెల్ఫీల నుంచి బెడ్‌రూమ్‌లో తీరిక సమయాన్ని గడుపుతున్న ఫోటోల వరకు ఆమె ప్రతి అడుగులోనూ తనదైన గ్లామర్‌ను ఒలకబోసింది. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా, తన అసలైన అందాన్ని అభిమానుల ముందుంచిన ఆమె ధైర్యాన్ని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.



## సీఎస్‌కేపై సన్ టీవీ దావా

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) చిక్కుల్లో పడింది. సీఎస్‌కేపై సన్‌టీవీ రూ. కోటి దావా వేసింది. జైలర్, జైలర్-2, కూలీ సినిమాల్లోని బ్యాగ్రౌండ్ మ్యూజిక్, ఆడియో ట్రాక్, డైలాగులు వాడుకొని కాపీరైట్ ఉల్లంఘించిందని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. కాగా వాటిని తొలగించామని సీఎస్‌కే చెప్పగా మరోసారి ఇరువర్గాల వాదన విని నిర్ణయం తీసుకుంటామని మద్రాస్ హైకోర్టు తెలిపింది. సీఎస్‌కే తన సోషల్ మీడియా ఖాతాల్లో



ప్రమోషనల్ వీడియోల కోసం జైలర్, జైలర్-2, కూలీ సినిమాల్లోని పాపులర్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, ఆడియో ట్రాక్‌లు, డైలాగులను వాడుకుంది. ఈ సినిమాలను నిర్మించింది తామని, వాటికి సంబంధించిన హక్కులు తమకే ఉన్నాయని, తమ అనుమతి లేకుండా వీటిని వాణిజ్య ప్రయోజనాల కోసం వాడటం చట్టవిరుద్ధమని సన్ టీవీ పేర్కొంది. కాపీరైట్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ. 1 కోటీ నష్టపరిహారం చెల్లించాలని సన్ టీవీ డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మద్రాస్ హైకోర్టు.. తక్షణమే సదరు కాపీరైట్ కంటెంట్ ఉన్న వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆదేశించగా.. తొలగించామని సీఎస్‌కే యాజమాన్యం బదులిచ్చింది. మరోసారి ఇరు పక్షాల వాదనలు విని నిర్ణయం తీసుకుంటామని తీర్పును వాయిదా వేసింది. సాధారణంగా ఐపీఎల్ జట్లు తమ అభిమానులను అలరించడానికి సినిమా పాటలను, డైలాగులను వాడుతుంటాయి. అయితే సన్ టీవీకి సొంతంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఉంది. ఈ రెండు జట్ల మధ్య మైదానంలోనే కాకుండా.. ఇప్పుడు కోర్టులోనూ చట్టపరమైన పోరాటం మొదలవ్వడం విశేషం. హండ్రెడ్ లీగ్‌లో పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను తీసుకోవడంపై సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది. తాజాగా సీఎస్‌కేపై దావా వేయడంతో ఆ ఫ్రాంచైజీ ఫ్యాన్స్ సన్‌రైజర్స్‌పై మండిపడుతున్నారు.

## యువీ దగ్గర పంత్ స్పెషల్ క్లాసులు



ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభానికి సమయం దగ్గరపడుతున్న తరుణంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ తన ఆటను సరికొత్తగా తీర్చిదిద్దుకునే పనిలో పడ్డాడు. గత సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన రిషబ్ పంత్.. ఈ సారి ఎలాగైనా అద్భుతమైన రీఎంట్రీ చేయాలని పట్టుదలతో ఉన్నాడు. ఇందులో భాగంగా భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ వైట్-బాల్ ప్లేయర్లలో ఒకడైన యువరాజ్ సింగ్‌ను మెంటార్‌గా ఎంచుకుని.. ముంబై వేదికగా కఠినమైన శిక్షణను పూర్తి చేశారు. ముంబైలోని చారిత్రాత్మక బ్రబౌర్న్ స్టేడియంలో దాదాపు 4 రోజుల పాటు ఈ ప్రత్యేక శిక్షణా శిబిరం జరిగింది. ఈ సెషన్లలో రిషబ్ పంత్ కేవలం బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా యువీ నుంచి విలువైన సలహాలను స్వీకరించారు. ముఖ్యంగా వైట్-బాల్ క్రికెట్‌లో తన పవర్ హిట్టింగ్‌ను మెరుగుపరుచుకోవడంపై రిషబ్ పంత్ దృష్టి పెట్టాడు. ఫీల్డింగ్ పరిమితులను అనుకూలంగా మార్చుకుంటూ కొత్త రకమైన షాట్లను ప్రయోగించడం.. ఒత్తిడి సమయంలో వికెట్ కాపాడుకుంటూనే పరుగులు రాబట్టడం వంటి అంశాలపై యువరాజ్ సింగ్ శిక్షణ ఇచ్చాడు. మ్యాచ్ పరిస్థితులను ప్రతిబింబించేలా డే అండ్ నైట్ ఈ ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించడం విశేషం.

## సౌతాఫ్రికా తెలివి తక్కువ జట్టు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో సౌతాఫ్రికా అత్యంత తెలివి తక్కువ జట్టు అని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ విమర్శించాడు. సూపర్-8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఓడిపోయి ఉంటే.. భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించేదని తెలిపాడు. బలమైన జట్టుగా ఉన్న టీమిండియాను కాస్త తెలివిగా



వ్యవహరించి ప్రపంచకప్ నుంచి బయటకు పంపించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడాన్ని మైఖేల్ వాన్ జీర్ణించుకోలేకపోతున్నాడు. ఫైనల్లో న్యూజిలాండే గెలుస్తుందని కూడా జోస్యం చెప్పాడు. కానీ భారత్ గెలవడంతో సౌతాఫ్రికా తెలివి తక్కువ టీమ్ అని తన అక్కసు వెల్లగక్కాడు. ఎయిడెన్ మార్క్‌రమ్ నాయకత్వంలోని సౌతాఫ్రికా.. అసాధారణ ప్రదర్శనతో ఓటమెరుగని జట్టుగా సెమీఫైనల్ చేరింది. కానీ కీలక సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మైఖేల్ వాన్.. సౌతాఫ్రికా టీమ్‌పై విమర్శలు గుప్పించాడు. 'ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో అత్యంత తెలివి తక్కువ జట్టు ఏదైనా ఉందా? అంటే అది సౌతాఫ్రికానే. ఎందుకంటే సూపర్-8 పోరులో వెస్టిండీస్ చేతిలో సౌతాఫ్రికా ఓడిపోయి ఉంటే భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించేది. కానీ ఆ మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలిచి భారత్ ప్రపంచకప్‌లో కొనసాగేందుకు అవకాశం కల్పించారు. తర్వాత టీమిండియా.. జింబాబ్వే, వెస్టిండీస్‌లపై విజయం సాధించి సెమీఫైనల్ చేరింది. సెమీస్‌లో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఇలాంటివి జరగకూడదు. సాధారణంగా జరగవు కూడా. కానీ.. ప్రపంచకప్ గెలవాలంటే ఉత్తమ జట్టును త్వరగా టోర్నీ నుంచి బయటకు పంపాలి.'అని మైఖేల్ వాన్ అభిప్రాయపడ్డాడు.



### గాయంతో ఐపీఎల్‌కు
## హర్షిత్ రాణా దూరం

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, టీమిండియా ప్లేయర్ హర్షిత్ రాణా.. ఐపీఎల్ 2026 సీజన్‌కు దూరమయ్యాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు సౌతాఫ్రికాతో జరిగిన సన్నాహక మ్యాచ్‌లో హర్షిత్ రాణా మోకాలికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. దాంతో చివరి నిమిషంలో నితీష్ రాణా.. టీ20 ప్రపంచకప్‌కు దూరమయ్యాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఫిబ్రవరి 9న ముంబైలో హర్షిత్ రాణా మోకాలికి సర్జరీ జరిగింది. ఈ సర్జరీ కారణంగా అతను కోలుకోవడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఐపీఎల్ 2026 సీజన్‌కు దూరంగా ఉండాలని హర్షిత్ రాణా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినా.. హర్షిత్ రాణా స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేయడంపై కేకేఆర్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. హర్షిత్ రాణా గైర్హాజరీ కేకేఆర్‌కు పెద్ద ఎదురుదెబ్బనే. ఐపీఎల్ 2024 సీజన్‌లో కేకేఆర్ విజేతగా నిలవడంలో హర్షిత్ రాణా కీలక పాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో అతను 19 వికెట్లు పడగొట్టి భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అతన్ని కేకేఆర్ రూ.4 కోట్లకు రిటైన్ చేసుకోగా.. 13 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసాడు. ఇప్పటివరకైతే కేకేఆర్ హర్షిత్ రాణా ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేయలేదు. ఆకాశ్ దీప్, వైభవ్ అరోరా, ఉమ్రాన్ మాలిక్, కార్తీక్ త్యాగిలో ఒకర్ని ఎంచుకోనుంది. 'దురదృష్టవశాత్తు హర్షిత్ రాణా.. ఈ సీజన్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. వైభవ్, ఉమ్రాన్, కార్తీక్, ఆకాశ్ దీప్‌లో ఒకరికి అతని స్థానంలో అవకాశం దక్కనుంది. రిప్లేస్‌మెంట్‌ను ఇంకా నిర్ణయించలేదు.'అని కేకేఆర్ వర్గాలు మీడియాకు తెలిపాయి. టీ20 ప్రపంచకప్ 2026లో గాయపడిన మతీష పతీరణ ఆడటంపై కూడా స్పష్టత లేదు. ముస్తాఫిజుర్ స్థానాన్ని కేకేఆర్ బ్లెస్సింగ్ ముజరబానితో భర్తీ చేసింది. ఈ విషయాన్ని కేకేఆర్ శుక్రవారం వెల్లడించింది.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 14-3-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## మానవ వికాసానికి దిక్సూచి.. గణితం

**నేడు అంతర్జాతీయ** గణిత దినోత్సవం. సంఖ్యల వెనుక దాగి ఉన్న అనంతమైన రహస్యాలను, మన దైనందిన జీవితంలో గణితం పోషిస్తున్న కీలక పాత్రను స్మరించుకోవడానికి ఇది ఒక గొప్ప సందర్భం. యునెస్కో ప్రకటన మేరకు ప్రతి సంవత్సరం మార్చి 14ను (పై) విలువను పురస్కరించుకుని అంతర్జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం. గణితం అంటే కేవలం లెక్కలు, ఫార్ములాలు మాత్రమే కాదు. అది ప్రకృతిని, విశ్వాన్ని అర్థం చేసుకునే ఒక శక్తివంతమైన భాష. ఒక చిన్న నగదు లావాదేవీ నుండి అంతరిక్ష ప్రయోగాల వరకు ప్రతిదీ గణితంపైనే ఆధారపడి ఉంది. ఆధునిక కాలంలో మనం వాడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సైన్స్, సెల్ ఫోన్ టెక్నాలజీ వంటివన్నీ గణిత శాస్త్ర పునాదులపైనే నిర్మితమయ్యాయి. ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్యలైన వాతావరణ మార్పులు, ఆర్థిక మాంద్యం, రోగాల వ్యాప్తిని అంచనా వేయడంలో గణిత నమూనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2026 థీమ్ 'ఆశ' అన్నట్లుగానే, సవాళ్లను అధిగమించడానికి గణితం మనకు ధైర్యాన్ని, స్పష్టమైన మార్గాన్ని చూపుతోంది. గణితం గురించి మాట్లాడుకున్నప్పుడు భారతీయ గణిత మేధావుల కృషిని విస్మరించలేము. సున్నాను కనిపెట్టిన ఆర్యభట్ట నుండి, అత్యంత క్లిష్టమైన సమీకరణాలను అలవోకగా సాధించిన శ్రీనివాస రామానుజన్ వరకు భారత్ ప్రపంచానికి అద్భుతమైన జ్ఞానాన్ని అందించింది. అయితే, ప్రస్తుతం విద్యార్థులలో 'గణిత భయం' అనేది ఒక ప్రధాన సమస్యగా మారుతోంది. దీనిని తొలగించి, గణితాన్ని ఒక కంఠస్థం చేసే సబ్జెక్టుగా కాకుండా, తార్కిక ఆలోచనను పెంపొందించే సాధనంగా బోధించాల్సిన అవసరం ఉంది. గణితం ఒక నిరంతర ప్రయాణం. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని నిరూపించే శాస్త్రం ఇది. విద్యార్థులు, యువత గణితంలోని అందాన్ని ఆస్వాదిస్తూ, దేశాభివృద్ధికి దీనిని ఒక ఆయుధంగా మలచుకోవాలి. గణితంపై అవగాహన పెంచుకుంటూ, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగడమే ఈ రోజు మనం తీసుకోవాల్సిన అసలైన సంకల్పం.



# దౌత్య వ్యూహానికి విజయం

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రస్తుత తరుణంలో, హోర్ముజ్ జలసంధి ద్వారా భారతీయ నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని కల్పించడం భారతదేశపు అసాధారణ దౌత్య విజయంగా అభివర్ణించవచ్చు. అమెరికా, ఇజ్రాయెల్ వంటి అగ్రరాజ్యాల నౌకలపై ఆంక్షలు కొనసాగుతున్నా, భారత జెండా ఉన్న నౌకలకు మినహాయింపు లభించడం అంతర్జాతీయ వేదికపై భారత ప్రాముఖ్యతను చాటిచెబుతోంది.

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన నిరంతర దౌత్య సంప్రదింపులు ఈ సానుకూల నిర్ణయానికి దారితీశాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి వీరిద్దరి మధ్య జరిగిన చర్చలు భారత ప్రయోజనాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించాయి. ఈ ఒప్పందం ఫలితంగా 'పుష్పక్', 'పరిమళ్' వంటి భారీ భారతీయ చమురు ట్యాంకర్లు ఎటువంటి ఆటంకం లేకుండా హోర్ముజ్ జలసంధిని దాటి గమ్యస్థానాలకు చేరుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు గుండెకాయ వంటి ఈ మార్గం గుండా ప్రయాణం సులభతరం కావడం వల్ల దేశంలో ఇంధన ధరల పెరుగుదల ముప్పు తప్పింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట. ఒకవైపు అమెరికాతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూనే, మరోవైపు ఇరాన్‌తో చారిత్రక బంధాన్ని కాపాడుకుంటూ భారత్ అనుసరిస్తున్న 'స్వతంత్ర విదేశీ విధానం' ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. భారత-ఇరాన్ సంబంధాల్లో చాబహార్ ఓడరేవు మరో మైలురాయి. ఈ ఓడరేవు నిర్వహణ కోసం కుదిరిన 10 ఏళ్ల ఒప్పందం భారత్‌కు మధ్య ఆసియా దేశాలకు మార్గాన్ని సుగమం చేసింది. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా ఆఫ్ఘనిస్తాన్, రష్యా, ఐరోపా దేశాలకు వాణిజ్యం జరపడానికి ఇది వ్యూహాత్మక మార్గం. అగ్రరాజ్యాల నౌకలు కూడా భయపడుతున్న సమయంలో భారత పతాకంతో నౌకలు ధైర్యంగా ప్రయాణించగలుగుతున్నాయంటే, అది భారతదేశం సాధించిన గొప్ప దౌత్య విజయమే. ఉద్రిక్తతల మధ్య కూడా తన ప్రయోజనాలను కాపాడుకుంటూ, ప్రపంచ శాంతి కోసం భారత్ చేస్తున్న కృషి ప్రశంసనీయం. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ, భారత్ ఇరాన్‌తో సంబంధాలను తెంచుకోలేదు. ఎర్ర సముద్రంలో హౌతీ తిరుగుబాటుదారుల దాడుల వల్ల సరుకు రవాణా వ్యయం పెరిగింది. ఇప్పుడు ఇరాన్ మార్గం సురక్షితం కావడం వల్ల భారత ఎగుమతిదారులు, దిగుమతిదారులకు భారీగా ఖర్చు తగ్గుతుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కానీ, ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభంలో కానీ భారత్ ఏ పక్షం వహించకుండా 'శాంతి చర్చలే మార్గం' అని చెబుతోంది. ఈ తటస్థ వైఖరి వల్ల ఇటు ఇజ్రాయెల్, అటు ఇరాన్ వంటి విరుద్ధ దేశాలతో కూడా భారత్ సంభాషించగలుగుతోంది. ఇరాన్‌కు భారత్ దగ్గరవ్వడాన్ని అమెరికా కొంత అసహనంతో చూడవచ్చు. దీనిని సమన్వయం చేసుకోవడం భారత దౌత్యవేత్తలకు ఒక పరీక్ష. ఒప్పందం ఉన్నప్పటికీ, యుద్ధ క్షేత్రంలో పొరపాట్లు జరిగే అవకాశం ఉంటుంది. అందుకే భారత నౌకాదళం నిరంతరం పహారా కాస్తూ, డ్రోన్ దాడుల నుండి రక్షణ కల్పిస్తోంది. ఈ విజయం కేవలం నౌకలకు దారి ఇవ్వడం మాత్రమే కాదు, అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ఒక 'నిర్ణయాత్మక శక్తి'గా ఎదుగుతోందని చెప్పడానికి నిదర్శనం.

ప్రపంచ దేశాలకు దిక్సూచిగా..

సంక్లిష్ట భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో భారతదేశ విదేశాంగ విధానం ఒక కీలక దశకు చేరుకుంది. దశాబ్దాలుగా అనుసరిస్తున్న ' అలీన విధానం' నుంచి 'బహుళ-భాగస్వామ్య' దిశగా భారత్ అడుగులు వేస్తోంది. ఒకప్పుడు కేవలం శాంతి వచనాలకే పరిమితమైన మన దౌత్యం, నేడు దేశ ప్రయోజనాలే పరమావధిగా ఆచరణాత్మకమైన మార్పులను సంతరించుకుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం లేదా పశ్చిమాసియా సంక్షోభం వంటి సందర్భాల్లో భారత్ ఏ ఒక్క కూటమికి లోబడకుండా తనదైన స్వతంత్ర నిర్ణయాలను తీసుకుంటోంది. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) గళంగా భారత్ ఆవిర్భవించడం విశేషం. పొరుగు దేశాలతో సంబంధాల బలోపేతానికి ప్రాధాన్యతనిస్తూనే, చైనాతో సరిహద్దు ఉద్రిక్తతలు, పాకిస్థాన్‌తో సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ మరింత పట్టుదలతో వ్యవహరిస్తోంది. జీ20 అధ్యక్ష పదవి ద్వారా భారత్ ప్రపంచ వేదికపై తన ముద్రను వేసింది. పర్యావరణ మార్పులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సంక్షోభాల పరిష్కారంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, ప్రస్తుత విదేశాంగ విధానం కొన్ని సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం విషయంలో భారత్ అనుసరిస్తున్న కొన్ని వైఖరులు దేశ ప్రయోజనాలకు, అంతర్జాతీయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని విమర్శకులు భావిస్తున్నారు. అలాగే అమెరికా, రష్యా మధ్య సమతుల్యతను కాపాడుకోవడం రాబోయే రోజుల్లో మరింత క్లిష్టంగా మారవచ్చు. విదేశాంగ విధానం అనేది స్థిరమైనది కాదు; అది మారుతున్న అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా పరిణామం చెందాలి. ప్రపంచ దేశాల మధ్య మధ్యవర్తిగా, నమ్మకమైన భాగస్వామిగా ఎదుగుతూనే, దేశ అంతర్గత ప్రయోజనాలను కాపాడుకోవడం నేటి దౌత్యవేత్తల ముందున్న ప్రధాన లక్ష్యం. ఒక బహుళ ధ్రువ ప్రపంచంలో భారత్ ఒక బలమైన శక్తిగా నిలబడాలంటే, సిద్ధాంతాలకు ఆచరణాత్మకతను జత చేయడం అత్యవసరం. దాన్ని భారత్ చక్కగా నిర్వర్తిస్తోంది.



**అభిషేక్ కురుమ**
బజరంగ్ దళ్ స్టేట్
బాలోపాసన ప్రముఖ్



# రాజకీయ చట్రాల్లో రాజ్యాంగ పదవులు

ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది ప్రాణవాయువు వంటిది. కానీ, ఆ విమర్శ విధానాల మీద కాకుండా, వ్యవస్థల పునాదుల మీద దాడి చేసేలా మారినప్పుడు అది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అవుతుంది. ఇటీవల కాలంలో రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని 'అభిశంసించాలంటూ' ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లు, కేవలం రాజకీయ లబ్ధి కోసమే తప్ప రాజ్యాంగ పరిరక్షణ కోసం కాదని స్పష్టమవుతోంది. ఇది ఒక ప్రమాదకరమైన ధోరణికి దారితీస్తోంది. రాజ్యాంగం ప్రకారం 'అభిశంసన' అనేది ఒక బ్రహ్మాస్త్రం వంటిది. అత్యంత అరుదైన, తీవ్రమైన కారణాలు ఉన్నప్పుడు మాత్రమే దీనిని ఉపయోగించాలి. కానీ, ప్రస్తుత రాజకీయాల్లో ప్రతి చిన్న రాజకీయ విభేదాన్ని, పాలనాపరమైన అసంతృప్తిని రాజ్యాంగబద్ధ పదవుల మీదకు నెట్టడం పరిపాటిగా మారింది. అధికార పక్షాన్ని నేరుగా ఎదుర్కోలేక, ఆ పక్షం చేసే నిర్ణయాలకు రాజ్యాంగబద్ధంగా ఆమోదముద్ర వేసే పెద్దలను (గవర్నర్లు, రాష్ట్రపతి వంటి వారు) లక్ష్యంగా చేసుకోవడం పిరికిపంద చర్యే అవుతుంది. ఒకసారి ఒక రాజ్యాంగబద్ధ పదవిపై అభిశంసన తీర్మానం ప్రతిపాదించబడితే, ఆ పదవికి ఉండే గౌరవం, పవిత్రత మసకబారుతాయి. అది నెగ్గినా, నెగ్గకపోయినా ఆ వ్యక్తి మీద పడే 'ముద్ర' వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని సడలిస్తుంది. ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం పదేపదే ఈ డిమాండ్లు చేయడం వల్ల, ఆయా పదవుల్లో ఉన్న వారు స్వతంత్రంగా, నిర్భయంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది అంతిమంగా పరిపాలనా స్తంభనకు దారితీస్తుంది. సభలో చర్చలు జరపడం, విధానపరమైన లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యత. కానీ, చర్చల కంటే ఎక్కువగా 'అభిశంసన' వంటి తీవ్రమైన పదాలను వాడటం ద్వారా ప్రజల్లో ఒక విధమైన అయోమయాన్ని, వ్యవస్థల పట్ల వ్యతిరేకతను పెంచే ప్రయత్నం జరుగుతోంది. రాజకీయ విభేదాలను రాజకీయంగానే ఎదుర్కోవాలి తప్ప, రాజ్యాంగ రక్షణ కవచాలను దెబ్బతీయకూడదు. రాజ్యాంగబద్ధ సంస్థలు ఏ ఒక్క పార్టీకి కొమ్ముకాయవు, అవి దేశానికి దిక్సూచీలు. వాటిని రాజకీయ రొంపిలోకి లాగడం అంటే మన ప్రజాస్వామ్య మూలాలను మనమే తవ్వుకోవడం వంటిది. ప్రతిపక్షాలు తమ బాధ్యతాయుత వైఖరిని ప్రదర్శించాల్సిన సమయం ఇది. వ్యవస్థల గౌరవాన్ని కాపాడటం అంటే రాజ్యాంగాన్ని గౌరవించడమే. ఇప్పటికైనా రాజకీయ స్వార్థం వీడి, రాజ్యాంగ పదవుల పట్ల హుందాతనాన్ని ప్రదర్శించకపోతే, చరిత్ర క్షమించదు.

- **వేణుమాధవ్ పరందాములు**, వరంగల్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.